REGD NO : APTEL 16144

# జన స్వరం పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com



జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 334 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 17-06-2025 | పేజీలు : 6

# అంతర్జాతీయ యోగా డే నిర్వహణకు సర్వం సిద్ధం

- 5 లక్షల మంది ఒకేచోట యోగా చేసేందుకు వేదికైన విశాఖ
- నాకు నచ్చిన నగరం విశాఖ... ప్రజలు చాలా క్రమశిక్షణతో ఉంటారు
- యోగా అందరి జీవితాల్లో భాగం కావాలి
- విశాఖ యోగా డే డిక్లరేషన్ ప్రకటిస్తాం
- విద్యార్థి దశ నుంచే యోగా అలవాటు కావాలి
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఆర్కే బీచ్‌లో 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లను పరిశీలించిన ముఖ్యమంత్రి
- అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష



**విశాఖపట్నం, జూన్ 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఈ నెల 21న విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సర్వం సిద్ధం చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఒకేచోట 5 లక్షల మందితో నిర్వహించే ఈ కార్యక్రమానికి విశాఖపట్నం వేదికైందని అన్నారు. ఆర్కే బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వేదికకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించిన సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆంధ్రా యూనివర్సిటీ కాలేజీ గ్రౌండ్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు, కూటమి ప్రజాప్రతినిధులు, నేతలతో నోవాటెల్ లో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

**నాకు నచ్చిన నగరం విశాఖ :**
'నేను ఎప్పుడూ ఇష్టపడే నగరం విశాఖపట్నం. ఇక్కడ ప్రశాంతత, సానుకూల వైఖరి, మంచికి సహకరించే మనస్తత్వం కలిగిన ప్రజలు ఉంటారు. హుద్‌హుద్ తుఫాన్ వచ్చిన సమయంలో వారం రోజుల పాటు విశాఖపట్నంలోనే ఉన్నాను. సంయమనంతో సమిష్టిగా ఉండి విపత్తును ఎదుర్కొందామని ప్రజలకు పిలుపునిచ్చా. ప్రజలందరినీ సాధారణ స్థితికి తీసుకొచ్చే వరకు కొన్ని నియమాలు పాటించాలని కోరితే అంతా పాటించారు. ఆ సమయంలో దీపావళి పండుగ కూడా వచ్చింది. ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లన్నీ ఎండిపోయాయి. అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి, పండుగ జరుపుకోండి కానీ క్రాకర్స్ కాల్చవద్దని ప్రజల్ని కోరాను. క్రాకర్స్ కాల్చకుండా క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో మెలిగారు.

**డిక్లరేషన్ ప్రకటిస్తాం :**
'నేను ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాల్లో యోగా డేనే అత్యంత పెద్దది, గొప్పది. ఆరోగ్య రంగంలో పెద్ద గేమ్ ఛేంజర్ అవుతుంది. ఈ నెల 20న మాక్ ఈవెంట్ నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నాం. విశాఖపట్నం యోగా డే డిక్లరేషన్ ప్రకటిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేయగలుగుతాయో డిక్లరేషన్ ద్వారా ప్రకటిస్తాం.

**గిన్నిస్ రికార్డు సాధిస్తాం :**
11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణకు విశాఖ అనువైన ప్రదేశం, మీరు చేయగలుగుతారని ప్రధాని మోదీ చెప్పగానే విజయవంతంగా చేస్తామని చెప్పా. యోగాను ప్రపంచమంతా జరుపుకునేలా ప్రధాని మోదీ కృషి చేశారు. 21వ తేదీన పౌరులు పాల్గొనేందుకు ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. సుందర నగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం చేయడం మన అదృష్టం. యోగా భవిష్యత్తులో అందరి జీవితంలో భాగం కావాలి. టెక్నాలజీ యుగంలో తీరికలేకుండా గడుపుతున్నాం. అందరిలో ఉండే ఆందోళన, ఒత్తిడి, ఆరోగ్య సమస్యలకు యోగా పరిష్కారం. రాష్ట్రంలో యోగాంధ్ర థీమ్‌తో నెలరోజులపాటు కార్యక్రమం చేపట్టాం. చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా నెల రోజులుగా యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. 21వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 1 లక్ష ప్రదేశాల్లో నిర్వహిస్తాం. 2 కోట్లమంది యోగా డేలో పాల్గొంటారు. ఇప్పటికే 2.17 కోట్లమంది పాల్గొంటామని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 25 లక్షల మందికి సర్టిఫికెట్లు ఇస్తాం. గిన్నిస్ రికార్డుకు ప్రయత్నిస్తున్నాం.. తప్పకుండా సాధిస్తాం.

**విద్యార్థి దశనుంచే యోగా అలవాటు చేసుకోవాలి :**
'9వ తరగతి పైన చదివే ప్రతి విద్యార్థి యోగా అలవాటు చేసుకోవాలి. మహిళలు, పురుషులు అనే వ్యత్యాసం లేకుండా అందరూ భాగస్వాములు కావాలి. శిక్షకులు, డాక్టర్లను అందుబాటులో ఉంచుతాం. ప్రతి 100 మందికి ఒక మరుగుదొడ్డి ఏర్పాటు చేశాం. యోగా కార్యక్రమానికి వచ్చే వారికి వాహన సదుపాయం కల్పించాం. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వచ్చే అవకాశం ఉంది. 11 నేవీ షిప్పుల్లో యోగాసనాలు ఉంటాయి. ఏదైనా అనివార్య పరిస్థితులు ఏర్పడి ఆర్కే బీచ్‌లో ఆంటంకం కలిగితే ప్రత్యామ్నాయంగా ఆంధ్రా యూనివర్సిటీలో కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే 3.5 లక్షల మందికి యోగా మ్యాట్స్ సిద్ధం చేశాం. 5 లక్షల మందికి టీ షర్ట్స్ అందిస్తాం.

**వారసత్వ సంపద యోగా :**
ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం భాగస్వామ్యమై ప్రజా ఉద్యమంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలి. ఇది ప్రజల కోసం చేసే కార్యక్రమం. యోగా వారసత్వ సంపద. భావితరాలకు అప్పగించే బాధ్యత మనమంతా తీసుకోవాలి. ప్రస్తుతం ఏదైనా ఆరోగ్య సమస్యకు మెడిసిన్ వేసుకుంటున్నాం. తర్వాత దాని ప్రభావం శరీరంలో తప్పకుండా చూపిస్తుంది. యోగాకు కొంత సమయం కేటాయించి చేస్తే ఇంట్లో వారికి, సమాజానికి భారం కాకుండా ఆరోగ్యంగా ఉంటాం. అన్ని వర్గాలు, మతాలు, కులాలు, ప్రాంతాలు కలసి చేయాల్సిన కార్యక్రమం ఇది. దీని ద్వారా మెరుగైన జీవన ప్రమాణం లభిస్తుంది. మా ప్రభుత్వం ఆరోగ్యానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తోంది. 30 రోజుల కార్యక్రమం తర్వాత కూడా యోగా కార్యక్రమాలు కొనసాగించేలా ప్రయత్నిస్తాం.

**కలుషిత ఆలోచనలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు :**
'బిల్ గేట్స్ ఫౌండేషన్ ఏపీ వైద్య రంగంలో సేవలందించేందుకు ముందుకొచ్చింది. ప్రస్తుతం కుప్పంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టాం. 6 నెలల్లో చిత్తూరు, రెండేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా సేవలు నిర్వహిస్తాం. ఏపీని ఆరోగ్యాంధ్రగా మార్చుతా. హెల్తీ, వెల్తీ హ్యాపీ రాష్ట్రంగా మార్చుతాం. కలుషిత ఆలోచన చేస్తే కలుషిత ఫలితాలే వస్తాయి...స్వచ్ఛమైన ఆలోచనలు చేస్తే స్వచ్ఛమైన పలితాలు వస్తాయి. ఇది మీడియా, సోషల్ మీడియా, రాజకీయ నాయకులు, సమాజంలో అన్ని వర్గాలకు వర్తిస్తుంది. కొందరు కలుషిత ఆలోచన చేసి సమాజాన్ని కలుషితం చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. అలాంటి వారిని సమాజానికి దూరం పెడితేనే బాగుంటాం. లేదంటే సమస్యల సుడిగుండంలో ఇరుక్కుపోతాం.' అని సీఎం చంద్రబాబు అన్నారు.

# బీజేపీలోకి వస్తే ఆహ్వానిస్తాం



- వికసిత్ భారత్ 2047 లక్ష్యం
- కొవ్వూరు - భద్రాచలం రైల్వే లైన్ ఓకే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

**రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఎవరైనా బీజేపీ సిద్ధాంతాలు, క్రమశిక్షణకు లోబడి పని చేయడానికి సిద్ధంగా ఉంటే వారిని పార్టీలోకి ఆహ్వానిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు,రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సోమవారం సాయంత్రం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి పనుల్లో కదలిక మొదలైందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ స్వప్నానికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ భాగం కావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఆంధ్రరాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అమరావతి రాజధాని కోసం ప్రపంచబ్యాంకు ద్వారా రూ.15 వేల కోట్లు, హడ్కో ద్వారా రూ.11 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం సమకూర్చడం జరిగిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అసత్యమన్నారు. లాభాల్లోకి తేవడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సౌత్‌కోస్టల్ రైల్వే డివిజన్ వైజాగ్ హబ్‌గా త్వరలో ఏర్పాటు కానుందన్నారు. భద్రాచలం-కొవ్వూరు 151 కిలోమీటర్ల రైల్వే లైను ఇప్పటికే మంజూరైందని, దువ్వాడ - రాజమహేంద్రవరం రైల్వే లైను డబ్లింగ్ చేపట్టడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి కాశీ, బెనారస్, రాజస్థాన్ తదితర ప్రాంతాలకు విమాన సర్వీసులు నడపాలంటూ ఇచ్చిన ప్రతిపాదనలు పరిశీలిస్తున్నామని అధికారులు చెప్పారన్నారు. ప్రస్తుతం తాను కామన్వెల్త్ ఉమెన్ పార్లమెంట్ ఇండియన్ ఛాప్టర్‌కు చైర్మన్‌గా, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ సభ్యురాలిగా ఉన్నానని వెల్లడించారు. ఇటు రాజమహేంద్రవరం పార్లమెంట్ చూసుకుంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఆ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నానన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను నిర్దేశించుకోవడం ద్వారా రాష్ట్రాలు, జిల్లాలు, నగరాలు, పట్టణాలు, గ్రామాలు సమగ్ర అభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతోనే ప్రధాని మోదీ పాలన చేస్తున్నారన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా మన జవాన్ల శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పామన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కేంద్రం ప్రతిపాదించిన నదుల అనుసంధానాన్ని సీఎం చంద్రబాబు అందిపుచ్చుకున్నారన్నారు. సమావేశంలో జీఎస్ఎల్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు, సాయి హాస్పటల్స్ అధినేత కె.విజయకుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఫిక్కి నాగేంద్ర, జిల్లా ఇన్‌చార్జి భగవాన్, నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, కంటిపూడి సర్వారాయుడు, నర్సిపల్లి హారిక, వీరా వీరాంజనేయులు, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్ పాల్గొన్నారు.


# కృష్ణమ్మ ఒడిలోకి సంగమేశ్వరాలయం

## శ్రీశైలానికి కొనసాగుతున్న వరదజలాలు



**కొత్తపల్లి, జూన్ 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** కర్ణాటక, మహారాష్ట్రలలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు వరదజలాలు వచ్చి చేరుతుం డటంతో నదీ గర్భంలో ఉన్న సప్తనదుల సంగమేశ్వరాలం కృష్ణా నది ఒడిలోకి చేరుతోంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులకు గాను 842.40 అడుగులు కాగా, నీటి సామర్థ్యం 215 టీఎంసీల కుగాను 65.457 టీఎంసీలుగా నమోదైంది. సంగమేశ్వరాలయం జలాధివాసం అవుతున్న అద్భుత దృశ్యాన్ని చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. ఎగువ ఉమామహేశ్వరాలయంలోని స్వామివారిని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 17 జూన్ 2025,
తిథి : బహుళ షష్ఠి (మ.02:49 వ.కు),
నక్షత్రం : శతభిషం (18తా తె.01:04 వ.కు),
బ్రహ్మ ముహూర్తం : తె.04:04ల తె.04:52,
రాహుకాలం : మ.03:24ల సా.05:01,
యమగండం : ఉ.08:54ల ఉ.10:32,
వర్జ్యకాలం : ఉ.08:25, ఉ.10:12

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 17 జూన్ 2025,
ఫజర్ : తెల్లవారుజామున గం. 04:31
సూర్యోదయం : ఉదయం గం. 05:50
జొహర్ : మధ్యాహ్నం గం. 12:21
అసర్ : సాయంత్రం గం. 03:46
మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:51
ఇష : రాత్రి గం. 08:11




జన స్వరం
**విలేకరులు కావలెను**
"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# రైతన్నా... నకిలీ విత్తనాల మాయకు జాగ్రత్త!

ఖరీఫ్ సీజన్ మొదలైంది. మట్టిలో బంగారం పండించేందుకు రైతన్న మళ్లీ ముట్టడిస్తున్నాడు. పొలాలను సిద్ధం చేసుకుంటూ, మంచి విత్తనం కోసం విత్తన విక్రయ కేంద్రాలు, ఫెర్టిలైజర్ దుకాణాల చుట్టూ తిరుగుతున్నాడు. వ్యవసాయం లాభసాటిగా మారాలంటే మొదటి మెట్టు నాణ్యమైన విత్తనం. అదే విత్తనం నకిలీగా మారితే రైతుకి నష్టం నెత్తిన మోపిన భారం అవుతుంది. ఈ రోజుల్లో వ్యవసాయాన్ని మింగేస్తున్న కొత్త భూతం ౧ నకిలీ విత్తనాల మాఫియా. వాస్తవానికి రైతుల నమ్మకాన్ని ఆయుధంగా మార్చుకున్న కొందరు వ్యాపార దందాగాళ్లు, నాణ్యత లేని విత్తనాలను సరఫరా చేస్తూ వ్యవసాయ రంగాన్ని చిన్నబుచ్చుతున్నారు. పసిపిల్లల మాదిరిగా వ్యవసాయాన్ని చూస్తున్న రైతులను ఈ మోసాలు కోలుకోలేని స్థితికి నెట్టేస్తున్నాయి. మొలకే రాని విత్తనం.. మొలక వచ్చినా పూతకూ కాయకూ దారి లేకపోవడం.. చివరికి దేనికీ తోచని క్షోభతో రైతన్న జీవితాన్ని అర్థాంతరంగా ముగించుకునే దుస్థితి రేపుతోంది. ఇది మానవీయంగా ఎంత భయానకమో, వ్యవస్థాపకంగా అంతటి నిష్ఠూరం.

ఇటీవలి రోజులలో వరంగల్, సూర్యాపేట, షాద్‌నగర్, ఆత్మకూరు లాంటి ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ, పోలీసు విభాగాలు నిర్వహించిన సోదాల్లో లక్షల రూపాయల విలువ చేసే నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయంటే ఈ మాఫియా ఎంత లోతుగా వేళ్లూనుకుందో అర్థం చేసుకోవచ్చు. దీన్ని ప్రభుత్వం గుర్తించినప్పటికీ, చర్యలు తేలికపాటి వైనంగా మారాయి. ప్రతి ఏడాది ఇదే కథ తిరుగుతోంది. ఇది ఆచరణలో చర్యలకే కాదు, వ్యవస్థల ఆపత్తులకూ, అధికారుల నిర్లక్ష్యానికీ నిదర్శనం. రైతు నమ్మకాన్ని కల్లోల పరచే ఈ వ్యవహారాన్ని వెంటనే అణగదొరికే విధంగా కఠిన చర్యలు తీసుకోవడం ప్రభుత్వాల బాధ్యతగా మారింది.




నకిలీ విత్తనాల మూలంగా రైతులు పడే కష్టాల్లో తక్కువ ధరకు వాటి లభ్యత ప్రధాన కారణం. దానికి తోడు "మూడు కొనుగోలు చేస్తే ఒకటి ఉచితం" వంటి ప్రకటనలు, ప్యాకింగ్‌పై ప్రకాశించే హెూలోగ్రామ్ మాయలు రైతులను మరింతగా మోసపుచేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో రైతులు అవగాహన లేక, విత్తన నాణ్యతను ముందుగానే పరీక్షించక, మార్కెట్‌లో లభ్యమవుతున్న దాన్నే నమ్మి కొనుగోలు చేయడం వల్ల ఈ మోసానికి బలి అవుతున్నారు. మరోవైపు, ప్రభుత్వ యంత్రాంగం వ్యవసాయ శాఖ నుండి పరిశీలన దాకా సక్రమంగా స్పందించకపోవడం ఈ మాఫియా భద్రతకు కీలకంగా మారుతోంది.


నిజానికి విత్తనం వ్యవసాయంలో ప్రాణాధారం. ఒక్క విత్తనం ద్వారా పుట్టే మొలకే రైతు జీవితాన్ని మార్చగలదు. అలాంటి కీలక అంశాన్ని కొందరు వ్యాపార అవసరాలకే పరిమితం చేయడం సమాజమంతటికీ ప్రమాదకరం. విత్తనాన్ని పరిశీలించడంలో సరైన అవగాహన రైతులో ఉండాలన్నదే ఈ సందర్భంలో అత్యంత ముఖ్యమైన విషయం. విత్తనం నాణ్యతను ట్రే పద్ధతిలో పరీక్షించవచ్చు. మొలకశాతం 80 శాతం కంటే తక్కువగా వస్తే, తగిన నిర్ణయం తీసుకోవాల్సిందే. అటు బీటీ విత్తనాల విషయంలో జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీ (జీఈఏసీ) నంబర్ ఉన్నవే ఎంపిక చేసుకోవాలి. ఇవన్నీ గమనించకుంటే విత్తనం చేతిలో ఉండగానే నష్టం ప్రారంభమవుతుంది. పైగా ప్రస్తుతం మార్కెట్లో బీటీ పేరిట నాన్ బీటీ విత్తనాలు అమ్ముతున్నారు. దీనిని రైతు తానే గుర్తించేందుకు 30 నిమిషాల్లో ఫలితాలు చూపే బీటీ డిటెక్షన్ కిట్‌లు అందుబాటులో ఉన్నాయి. అయితే అవి అందరికీ చేరాలని, వాటిపై అవగాహన పెరగాలని చెప్పుకోవాలి.

ఇలాంటి పరిస్థితుల్లో నకిలీ విత్తనాలపై రైతన్న తిరుగుబాటు చేయాల్సిన సమయం వచ్చింది. రైతు కేవలం ఉపాధి దాతుడే కాదు, దేశ ఆహార భద్రతకు మూలస్తంభం. అతడి పోరాటం వ్యక్తిగతంగా కాక సమాజమంతటికీ

## ఎడిటోరియల్

సంబంధించినది. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రభుత్వంతో పాటు రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా – అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలి. ఏ రైతు మోసపోకుండా ఉండాలి. ఒక్కరైన రైతు ఆకలితో నిద్రపోకూడదు. ఒకరైనా విత్తనం వేసి మొలకలేదని కన్నీటి జలాల్లో మునగకూడదు. ఇది ఒక వ్యవసాయ భద్రత యుద్ధం.

నకిలీ విత్తనాలను తిరస్కరించాలి. నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి. శాస్త్రీయంగా పరీక్షించి, ధృవీకరణ పొందిన విత్తనాలను మాత్రమే వేసుకోవాలి. అవగాహనే ఆయుధం. నాణ్యతే విజయం సాధించే మార్గం. రైతన్న మోసపోకూడదు. మట్టి మోసపోవడానికి మనకింకా తీరిక లేదు. వ్యవసాయం నిలబడితేనే సమాజం నిలబడుతుంది. నకిలీ విత్తనాలను అరికట్టే ఉద్యమానికి ఇది సరైన సమయం.



జి. అజయ్ కుమార్,
వ్యవసాయ నిపుణులు.

## విజయవాడలో ఆధునిక మహిళా పోలీసు స్టేషన్ ప్రారంభం

**హాజరైన కమిషనర్ ఎస్.వి. రాజ శేఖరబాబు**



**విజయవాడ, జూన్ 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** బందర్ రోడ్డులోని పాత కంట్రోల్ రూమ్ భవనంలో ఉన్న మహిళా పోలీసు స్టేషన్‌ను ఆధునికీకరించిన అనంతరం, నగర పోలీసు కమిషనర్ ఎస్వి రాజ శేఖరబాబు సోమవారం ప్రారంభించారు. పునర్నిర్మించిన ఈ స్టేషన్‌లో మహిళల కోసం ఆధునిక వసతులతో కూడిన విభాగాలు ఏర్పాటు చేయడం విశేషం. ఇందులో అధికారుల రూములు, కోర్ట్ రూమ్, రిసెప్షన్, మహిళా హెల్ప్ డెస్క్, కౌన్సిలింగ్ సెంటర్‌లు మాత్రమే కాకుండా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం, చిన్నారుల కోసం ప్రత్యేకంగా చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్, ప్లే రూమ్ వంటి విభాగాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డీసీపీలు కె.జి.వి. సరిత, తిరుమలేశ్వర రెడ్డి, ఉదయారాణి, కృష్ణమూర్తి నాయుడు, ఎస్.వి.డి. ప్రసాద్, ఏడీసీపీలు ఎ.వి.ఎల్ ప్రసన్న కుమార్, ఏసీపీలు లతా కుమారి, స్రవంతి రాయ్, పావన్ కుమార్, పోలీసు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజ శేఖరబాబు మాట్లాడుతూ, మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళా పోలీసు స్టేషన్‌లో బాధితులు భద్రత, భరోసా కలిగేలా వ్యవహరించాలన్నారు. బాధితురాలి మనోభావాలు గౌరవించాలనీ, మానవీయతతో వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. నేరస్తులకు శిక్ష తప్పదనే భయాన్ని నేరం చేసేవారిలో కలిగించేందుకు టెక్నాలజీ ఆధారంగా సాక్ష్యాలు సేకరించాలని సూచించారు.ఇలాంటి ఆధునిక పోలీసు స్టేషన్‌లు మహిళల పట్ల ప్రభుత్వ, పోలీసు శాఖ కట్టుబాటు, రక్షణ, సేవలపట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయని కమిషనర్ తెలిపారు.

## బుచ్చిరెడ్డిపాలెం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి
- రూ.10 లక్షల డ్రైనేజీకి శంకుస్థాపన
- త్వరలో కంటి పరీక్షలు
- ప్రజలకు మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్యే హామీ

కోవూరు, జూన్ 16 (జనస్వరం) : బుచ్చిరెడ్డిపాలెం పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉదయం బుచ్చి పంచాయతీ 20వ వార్డు రామచంద్రాపురంలో ఎమ్మెల్యే పర్యటించి, రూ. 10 లక్షల నిధులతో నిర్మించబోయే డ్రైనేజీకి శంకుస్థాపన చేశారు. వార్డులోని సమస్యలు, ప్రజల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామచంద్రాపురంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నివసిస్తున్న ప్రజల కనీస అవసరాలపై దృష్టి సారించి అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. స్థానికంగా స్మశానవాటికకు ప్రహరీ లేకపోవడాన్ని స్థానికులు తమ దృష్టికి తీసుకురావడంతో త్వరలోనే దీని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా మన్నారు. ఇక ప్రజలకు అందుబాటులో ఉన్న సచివాలయం లేకపోవడం వల్ల వారు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉందని గుర్తించిన ఎమ్మెల్యే, ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులతో సంప్రదించి సచివాలయం ఏర్పాటు చేయేందుకు చర్యలు చేపడతామన్నారు. త్వరలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చి ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మున్సిపల్ కమిషనర్ డి.బాలకృష్ణ, తహసీల్దార్ అంబటి వెంకటే శ్వర్లు, కౌన్సిలర్లు శ్రీదేవి, బెలూం మల్లారెడ్డి, టీడీపీ మండల రూరల్ అధ్యక్షుడు బెజవాడ జగదీష్, గౌరవ అధ్యక్షుడు టంగు టూరి మల్లారెడ్డి, పార్టీ నాయకులు ఎర్రం రెడ్డి గోవర్ధన్ రెడ్డి, జొన్నవాడ ఆలయ మాజీ ఛైర్మన్ పుట్ట సుబ్రహ్మణ్యం నాయుడు, ఎంవీ శేషయ్య, బత్తుల హరికృష్ణ, మోర్ల మురళి, కోడూరు కమలాకర్ రెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



## రాజధాని నిర్మాణానికి, రాష్ట్రాభివృద్ధికి విఘ్నాలు రాకుండా రక్షించాలి



- ఎంపీ కేశినేని చిన్ని కుమారుడు కేశినేని వెంకట్
- దూండి గణేష్ విగ్రహ శంకుస్థాపన మహెూత్సవంలో పాల్గొన్న కేశినేని వెంకట్, సినీ నటుడు సుమన్
- సందడి వాతావరణం నెలకొన్న పరిసర ప్రాంతాలు





**విజయవాడ, జూన్ 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రాభివృద్ధి, అమరావతి రాజధాని నిర్మాణానికి ఎలాంటి విఘ్నాలు రాకుండా గణపతిదేవుడు రక్షించాలని, రాష్ట్ర ప్రజలందరిపై విఘ్నవినాశకుడైన మహాగణపతి ఆశీస్సులు ఉండాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కుమారుడు కేశినేని వెంకట్ ఆకాంక్షించారు. లేబర్ కాలనీ మైదానంలో దూండి గణేష్ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న 72 అడుగుల మహా మట్టి గణపతి విగ్రహ శంకుస్థాపన మహెూత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేశినేని వెంకట్, ప్రముఖ సినీ నటుడు సుమన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వీరికి దూండి గణేష్ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దూండి రాకేష్‌తో పాటు కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విగ్రహ స్థలానికి శంకుస్థాపన చేసి, కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. విగ్రహ ఏర్పాటుకు అవసరమైన షెడ్ నిర్మాణానికి కర్ర పూజ చేయడం కూడా ఈ సందర్భంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కేశినేని వెంకట్ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా 72 అడుగుల మట్టి గణపతి విగ్రహాన్ని రాజధాని ప్రాంతంలో ఏర్పాటు చేయడం ప్రజలందరి అదృష్టమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. వినాయక చవితికి అందరూ మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో సినీ నటుడు సుమన్‌తో కలిసి పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ, ఖైరతాబాద్ గణేశ్ విగ్రహాన్ని మించిన ఎత్తులో మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని ప్రశంసించారు. పర్యావరణ పరిరక్షణకు మట్టితో విగ్రహం ఏర్పాటు చేయడాన్ని సమర్థించుకుంటూ, ఈ మహాగణపతి విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తున్న దూండి గణేష్ సేవాసమితికి అభినందనలు తెలిపారు. ఆర్యవైశ్య డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, దూండి గణేష్ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దూండి రాకేష్ మాట్లాడుతూ, గతంలో 63 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు, గత నాలుగేళ్లుగా 72 అడుగుల మహామట్టి గణపతి విగ్రహాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణం త్వరగా పూర్తై అభివృద్ధిని ప్రజలందరూ ఆస్వాదించాలనే ఆకాంక్షతో ఈ విగ్రహ స్థాపన చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అతిథులుగా విచ్చేసిన కేశినేని వెంకట్, సినీ నటుడు సుమన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మహామట్టి గణపతి పోస్టర్ లాంచ్ కార్యక్రమం త్వరలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దూండి గణేష్ సేవాసమితి కమిటీ సభ్యులు గడ్డం రవి, పేర్ల రవి, ముక్తేశ్వరరావు, డి. సుబ్బారావు, చైతన్య, నాగేశ్వరరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, డివిజన్ అధ్యక్షులు శివశర్మ, పేరం సత్యనారాయణ, టీడీపీ సీనియర్ నాయకులు రేగళ్ళ లక్ష్మణరావుతో పాటు ఎన్డీయే కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 17, 18 తేదీల్లో కొల్లేరులో పర్యటించనున్న సుప్రీం సాధికారిత కమిటీ

- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి
- పాల్గొన్న ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాసరావు, పత్సమట్ల ధర్మరాజు



**ఏలూరు, జూన్ 16 (జనస్వరం) :** కొల్లేరులో వాస్తవ పరిస్థితులు పరిశీలించేందుకు 17,18 తేదీల్లో జిల్లాలో సుప్రీంకోర్ట్ నియమించిన సాధికారిత కమిటీ పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి తెలిపారు. సోమవారం సాధికారిత కమిటీ పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా నిడమర్రు మండలం తోకలపల్లి, మండవల్లి మండలం మణుగునూరు, పూలపర్రు, కైకలూరు మండలం ఆటపాక, ఆలపాడు, కొల్లేటికోట ప్రాంతాలలో కలెక్టర్ వెట్రిసెల్వి పర్యటించారు. వీరితో పాటు కైకలూరు ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాసరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ కొల్లేరుకు సంబంధించి సుప్రీం సాధికారిత కమిటీ ఈనెల 17,18 తేదీల్లో కొల్లేరులోని కొన్ని ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పర్యటన చేయనున్నట్లు తెలిపారు. మానవీయత కోణంలో కొల్లేరులో ఎన్ని నివాసిత ప్రాంతాలు ఉన్నాయి, జిరాయితీ భూములు, డి.ఫారం పట్టా భూములు ఏమున్నాయి, 2006 సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఎలా అమలు చేశారనే సంబంధిత 4 అంశాలను కమిటీ పరిశీలించనున్నదన్నారు. దీనికి సంబంధించి మంగళ, బుధ వారాల్లో సాధికారిత కమిటీ పర్యటించే ప్రాంతాల ప్లాన్‌ను తయారు చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించినట్లు తెలిపారు. రెండు రోజుల పర్యటన అనంతరం బుధవారం ఏలూరు కలెక్టరేట్ లో కొల్లేరుకు సంబంధించిన వినతులను స్వీకరించడం జరుగుతుందన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడు మండలంలోని కొల్లేరు వాసులు కూడా తమ సమస్యలను అందజేయవచ్చన్నారు. కైకలూరు ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ వేత్తలు, కొల్లేరులో కొన్ని వందల సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న ప్రజలు వారి అవసరాలు, వారి సమస్యలు, జిరాయితీ భూములకు సంబంధించి పరిశీలనకోసం సుప్రీం సాధికారిత కమిటీ జిల్లాలో పర్యటించనున్నదన్నారు. కొల్లేరులో వాస్తవ పరిస్థితులు పరిశీలించి మూడు నెలల్లో నివేదిక సమర్పించాలని కమిటీని సుప్రీంకోర్టు ఆదేశించడం జరిగిందన్నారు. దానిలో భాగంగానే సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరపున, కొంతమంది ప్రైవేట్ రైతులు కూడా అర్జీని పెట్టుకున్నట్లు తెలిపారు. 2006లో కొల్లేరులో చేపల చెరువులు కొట్టిన పరిస్థితి, ప్రజల జీవనవిధానం వారి ఇబ్బందులను జిరాయితీ భూముల వివరాలను కమిటీ మంగళవారం నిడమర్రు ప్రాంతంలో జిరాయితీ భూములను, బుధవారం కైకలూరు ప్రాంతంలోని ఆటపాక, కొల్లేటికోటలో పర్యటించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తర తరాల నుంచి జీవిస్తున్న కొల్లేరు ప్రజలు తమ వినతులను కమిటీకి సమర్పిస్తారన్నారు. అనంతరం కమిటీ పైడిచింతలపాడు మీదుగా ఏలూరు చేరుకుంటుందన్నారు. అయితే ఈ పర్యటనలో కొన్ని మార్పులు కూడా ఉండవచ్చని వాటిని తెలియజేసినట్లు తెలిపారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ సుప్రీంకోర్ట్ నియమించిన సాధికారిత కమిటీ మంగళవారం నిడమర్రులో పర్యటిస్తుందని, కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యలు, కొల్లేరు పరిరక్షణ, తదితర అంశాలను కమిటీ దృష్టికి ప్రజలు తీసుకువసారన్నారు. కూటమి ప్రభుత్వం కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణతోపాటు, ప్రజల సంక్షేమాన్ని కూడా ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. కమిటీ ఏలూరులో సమావేశం సమయంలో ఉంగుటూరు నియోజకవర్గంలోని కొల్లేరు ప్రాంత ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తారని చెప్పారు. వీరివెంట ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్, డిఎఫ్ఓ (వైల్డ్ లైఫ్) బి.విజయ తదితరులు ఉన్నారు.

## ఉత్తమ వైద్యులుగా ఎంపికైన డాక్టర్లకు శాలువాలతో సన్మానం





**భైంసా, జూన్ 16 (జనస్వరం) :** హైదరాబాద్‌లో సుమన్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఉత్తమ డాక్టర్ అవార్డు" కార్యక్రమంలో భాగంగా భైంసా ప్రభుత్వం ప్రాంతీయ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కాశీనాథ్, ముధోల్ ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన డాక్టర్ అనిల్ కుమార్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా అన్న బహుసాటే క్రాంతి సేన బృందం వారిని శాలువాలతో ఘనంగా సన్మానించింది. వైద్యులు ప్రజల ఆరోగ్యానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని, వారు మరెన్నో అవార్డులు అందుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉత్తం భలేరావ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఏఎస్పై చిలిమ్కర్ గంగాధర్, ఉపాధ్యాయులు శంకర్ గోరేఖర్, బహుసాటే మహిళా అధ్యక్షురాలు బాసునూరే దురుపత్ బాయి, సినిమా డైరెక్టర్ కొత్తూరు శంకర్, 108 టెక్నీషియన్ పూజారి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రబాన్ గణపతి, తానూర్ మండల యువనాయకుడు సాయినాథ్ గాయక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి దుకాణం ముందు సీసీ కెమెరాలు పెట్టాలి

ఎస్సై సోమశేఖర్





**హైదరాబాద్, జూన్ 17 (జనస్వరం) :** జూబ్లీహిల్స్ ఎస్సై సోమశేఖర్ ఆధ్వర్యంలో, వెంకటగిరిలోని ముఖ్యమైన కూడలిలో ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలు బిగించాలని, సోమవారం సాయంత్రం ప్రతి దుకాణానికి వెళ్లి సీసీ కెమెరా బిగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే రోడ్డుకి ఇతర వ్యాపార కొట్టు వల్ల ఆక్రమించడం తో ట్రాఫిక్ ఇబ్బందితో పాటు, వాహనదారులతో అలాగే పాదచారులకు తీవ ఇబ్బంది కలుగుతుంది అని గ్రహించడంతో, అట్టి వ్యాపార సముదాయ వాళ్లను రోడ్డుకి ముందర ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలని, ఇది ప్రతి దుకాణం వారి బాధ్యతగా తీసుకొని రోడ్డుని ఆక్రమించుకోకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ ఆధ్వర్యంలో, ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటామని, ఏమైనా సమస్య వస్తే తమను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా ఫుట్పాత్లను ఆక్రమించకుండా చర్యలు తీసుకుంటూ ప్రతి దుకాణదారుడు తమ దుకాణం బయట కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దినేష్ ఆనంద్, గాంధీ, రాజు మొదలైన సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతియుతంగా కలసి మెలసి జీవించాలి



**పులివెందుల జూన్ 16 (జనస్వరం) :** ప్రజలందరూ శాంతియుతంగా కలిసి మెలిసి జీవించాలని సీఐ ఎన్.వి రమణ పేర్కొన్నారు. ఎస్పీ అశోక్ కుమార్, డిఎస్పీ మురళి నాయక్ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో సోమవారం ఆయన ప్రజలతో మమేకమయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. అంతేకానీ ఘర్షణలకు దిగరాదన్నారు. పల్లెలు ప్రశాంతంగా ఆహ్లా దకరమైన వాతావరణంలో కలిసిమెలిసి జీవించాలన్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా కుటుంబాలను గుర్తు చేసుకుంటూ పల్లెల్ని ప్రగతి పథం వైపు నడిపించేలా అడు గులు వేయాలన్నారు. సెల్ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ఎంతటి ప్రమాదకరమో వారికి సవివరంగా వివరించి చెప్పారు. ప్రజలు పోలీసులు స్నేహభావంతో కలిగి ఉండాలన్నారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని అర్ధరాత్రి అయినా కూడా అందు బాటులో ఉంటారని, నేరుగా తమ సెల్ ఫోన్ కూడా ఫోన్ చేసి సమస్యను తెలుపవచ్చు అన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవానికి వైభవంగా ఏర్పాట్లు

- జూలై 1న జరగనున్న మహోత్సవానికి సమగ్ర సన్నాహాలు
- మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్, జూన్ 17 (జనస్వరం) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో ఆషాఢ మాసం మొదటి మంగళవారం జరగనున్న ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణ మహోత్సవం – 2025 సందర్భంగా, భక్తుల సౌకర్యార్థం అన్ని విభాగాల సమన్వయంతో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. జూలై 1న నిర్వహించనున్న ఈ కళ్యాణానికి సంబంధించి సోమవారం ఆలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ హరి చందన్ దాసరి, ఆలయ ఈఓ మహేందర్ గౌడ్, ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, "హైదరాబాద్ నగరానికి ప్రత్యేక గుర్తింపునిచ్చే పవిత్ర క్షేత్రం బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయం. అమ్మవారి కళ్యాణోత్సవాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో జరిపేందుకు అన్ని శాఖలతో సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం," అని తెలిపారు. గతంలో వచ్చిన ఇబ్బందులు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టంచేశారు. సమీక్షా సమావేశంలో భద్రతా ఏర్పాట్లు, క్యూలైన్లు, బారికేడ్లు, తాగునీటి సౌకర్యం, వైద్య శిబిరాలు, అలాగే శానిటేషన్, పార్కింగ్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. అన్నిచోట్లా బారికేడ్లు ఏర్పాటు చేసి, భక్తులు సౌకర్యంగా, శాంతియుతంగా అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే, అర్చకులు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఎంపీలకు అమ్మవారి దర్శనమొక శుభాశీస్సులతో ప్రారంభమైంది. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో, కళ్యాణోత్సవం రోజున ప్రత్యేక బస్సులు, ట్రాఫిక్ నియంత్రణ, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీంలు సిద్ధంగా ఉండనున్నాయి. ఈ మహోత్సవం సందర్భంగా ప్రజలందరూ తల్లిదేవి అనుగ్రహాన్ని పొందాలని ఆలయ అధికారులు ఆకాంక్షించారు.

## 29 పార్కులకు రూ. ఏడు కోట్లు నిధులు మంజూరు

- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి
- చంద్రన్న పార్కులబాట కార్యక్రమంపై సమీక్షా సమావేశం



**నెల్లూరు, జూన్ 16 (జనస్వరం) :** రూరల్ నియోజకవర్గ పరిధిలోని సుమారు 29 పార్కులకు సంబంధించి ఏడు కోట్ల రూపాయల నిధులు మంజూరు కావడంతో ఈ పనుల శంకుస్థాపనలకు సంబంధించి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నెల్లూరు కార్పొరేషన్ అధికారులతో సోమవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్‌లో కీలకమైన పార్కులన్నీ ఈ నిధులతో కొత్త రూపు సంతరించుకుంటున్నాయని పేర్కొన్నారు. మొత్తం 29 పార్కులకు సంబంధించి ఏఏ తేదీలలో శంకుస్థాపన చేయాలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే నిర్ణయించారు. అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు. 18, 19, 20 తేదీల్లో అత్యంత ఘనంగా వీటిని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇన్చార్జి దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి నూకరాజు మదన్ కుమార్ రెడ్డి నెల్లూరు నగర కార్పొరేషన్ ఈఈ శేషగిరిరావు డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## బ్లడ్ క్యాన్సర్ బాధిత బాలుడికి ఆర్థిక సాయం



**భైంసా, జూన్ 16 (జనస్వరం) :** మండలంలోని దేగాం గ్రామానికి చెందిన ప్రేమల రమేష్, రమేష్ దంపతుల కుమారుడు సాత్విక్ కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఇప్పటికే ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స కోసం సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు చేసిన కుటుంబం, ఆర్థికంగా తీవ్రంగా కుదిపోయి, ఇక చికిత్స కొనసాగించలేని పరిస్థితికి చేరింది. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన యువ నాయకురాలు సిరం సుష్మా రెడ్డి స్పందిస్తూ, బాధిత కుటుంబానికి అండగా నిలవాలంటూ గ్రామానికి సంబంధించిన సోషల్ మీడియా గ్రూపులో మెసేజ్ పెట్టారు. ఆమె పిలుపుకు స్పందించిన పలువురు దాతలు తోచినంత ఆర్థిక సాయం చేయడం ద్వారా సుష్మా రెడ్డి బ్యాంక్ ఖాతాలో మొత్తం రూ.54,000 జమ చేశారు. తదుపరి సోమవారం గ్రామస్తులు స్వయంగా ప్రేమల రమేష్ ఇంటికి వెళ్లి సాత్విక్ వైద్యం కోసం సేకరించిన నగదు సహాయాన్ని చేతుల మీదుగా అందజేశారు. ఈ సమయంలో బాధిత కుటుంబ సభ్యులు ఆర్థికంగా అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమాజం ఈ విధంగా ముందడుగు వేసి సాయమందిస్తే ఎన్నో జీవితాలు నిలబెడతామని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## రైతు నేస్తం కార్యక్రమం ప్రారంభంతో రైతు భరోసా నిధులు జమ

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించిన కొడంగల్, బొంరాస్‌పేట రైతులు





**బొంరాస్‌పేట/కొడంగల్, జూన్ 16 (జనస్వరం) :** సీఎం రేవంత్ రెడ్డి రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వేదికగా రైతు నేస్తం పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి బటన్ నొక్కి రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలో జమ చేశారు. రైతు నేస్తం కార్యక్రమాన్ని బొంరాస్ పేట మండలం తుంకిమెట్ల క్లస్టర్‌లో ఏడీఏ శంకర్ రాథోడ్, ఇన్చార్జి ఎంపీడీఓ వెంకన్ గౌడ్, ఏఈఓలు శైలజ, పవన్, రైతులు పాల్గొన్నారు. కొడంగల్ మండలం రావులపల్లి రైతు వేదికలో నిర్వహించిన సమావేశానికి జిల్లా ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్, తహసిల్దార్ విజయ్ కుమార్, ఏఓ తులసి, ఏఎంసీ చైర్మన్ అంబయ్య గౌడ్, ఆయా గ్రామాల రైతులు హాజరయ్యారు.

## మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం

- 140 కోట్ల భారతీయుల గౌరవం
- బీజేపీ నేత చిలక ప్రవీణ్ కుమార్



**నెల్లూరు, జూన్ 16 (జనస్వరం) :** భారత ప్రధాని నరేంద్ర మోదీకి సైప్రస్ ప్రభుత్వం అందించిన అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ III' 140 కోట్ల భారతీయులకు దక్కిన అరుదైన గౌరవమని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలక ప్రవీణ్ కుమార్ అన్నారు. మోదీ ఈ పురస్కారాన్ని స్వీకరించిన సందర్భంగా నెల్లూరులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ "ఈ అవార్డు మన దేశ ప్రతిష్ఠను ప్రపంచ స్థాయిలో మరింత ఇనుమడింపజేసింది" అని పేర్కొన్నారు. రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ తొలి అధ్యక్షుడు మకరియోస్ III పేరు మీద ఈ పురస్కారం అందించబడిందని వివరించిన చిలక ప్రవీణ్ కుమార్, "ఈ అవార్డును స్వీకరిస్తూ మోదీ సైప్రస్‌తో ఉన్న స్నేహానికి అంకితమిస్తున్నట్లు ప్రకటించడం ఆయన నిరాడంబరతకు, దూరదృష్టికి నిదర్శనం" అని అన్నారు. "ఈ అవార్డును ప్రధానమంత్రి భారత ప్రజలకు అంకితం చేయడం దేశానికి గర్వకారణం. ఇది 'వసుధైవ కుటుంబకం' భావనకు శాంతికి భారత్ అంకితంగా ఉందన్న అంకితభావాన్ని ప్రపంచానికి గుర్తు చేసింది" అని చెప్పారు. రెండు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని సైప్రస్‌ను సందర్శించడం ఇదే ప్రథమమని గుర్తు చేస్తూ, ఈ పర్యటన ద్వైపాక్షిక సంబంధాల్లో కొత్త ఒరవడికి నాంది పలుకుతుందని అభిప్రాయపడ్డారు. "ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో భారత్ అంతర్జాతీయంగా తన స్థానాన్ని బలోపేతం చేసుకుంటూ, సమగ్ర శాంతి, అభివృద్ధికి కారకంగా నిలుస్తోంది" అని చిలక ప్రవీణ్ వ్యాఖ్యానించారు.

## రాజారెడ్డి రాజ్యాంగం కన్నా అంబేద్కర్ రాజ్యాంగ పాలనే మిన్న

టీపీసీ సభ్యుడు మేకల కృష్ణ విమర్శ



**శంఖవరం, జూన్ 16 (జనస్వరం) :** వైసీపీ నాయకులకు ఇప్పుడు అంబేద్కర్ రాజ్యాంగం గుర్తొస్తున్న తీరును విస్మయం వ్యక్తం చేస్తూ, జిల్లా టెలికమ్యూనికేషన్ సలహామండలి సభ్యులు మేకల కృష్ణ తీవ్రంగా స్పందించారు. 2019 నుండి 2024 మధ్య కాలంలో అంబేద్కర్ రాజ్యాంగం గుర్తుకు రాలేదని, ఆ సమయంలో నాయకుల వ్యాఖ్యలు, ప్రభుత్వ విధానాలు ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకంగా ఉండినట్లు గుర్తు చేశారు. పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత దూషణలు, చంద్రబాబు భార్యను అసెంబ్లీలో అవమానించడాన్ని తలచుతూ, అప్పుడు రాజ్యాంగం గురించి ఊహించనివారు, ఇప్పుడు అధికార దుర్వినియోగంపై చర్యలు తీసిన కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం వాస్తవాన్ని మరిచిన చర్య అని పేర్కొన్నారు. మాజీ అధికారులైన ఐఏఎస్, ఐపీఎస్‌లపై చర్యలకు ప్రతిస్పందనగా వైసీపీ నాయకులు ఇప్పుడు "రెడ్ బుక్" రాజ్యాంగమని విమర్శించడం రాజకీయ దురుద్దేశమని వ్యాఖ్యానించారు. నర్సీపట్నం డాక్టర్ మృతికి సంబంధించి, సీతానగరం దళిత యువకుడిపై జరిగిన అవమాన ఘటనలు, ప్రజల ఆస్తులను బలవంతంగా స్వాధీనం చేసుకున్న దౌర్జన్యాలు అన్ని వైసీపీ ప్రభుత్వ పాలనను 'రాజారెడ్డి రాజ్యాంగం'గా ముద్రించాయని అభిప్రాయపడ్డారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఈ పాలనను ఖండించారని, కూటమికి 164 సీట్లు, వైసీపీకి కేవలం 11 సీట్లు ఇచ్చినదే తాము అనుసరించిన మార్గం తప్పని తేల్చిందని తెలిపారు. ఇప్పుడైనా వైసీపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. "రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిన వైసీపీ పాలనను కూటమి ప్రభుత్వం ఆదుకునే బాధ్యతను తీసుకుంది," అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందని తెలిపారు. "తల్లికి వందనం", మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లులకు రూ.13,000 చొప్పున నిధులు, రాబోయే 'రైతు బరోసా', ఉచిత బస్సు, నెలకు రూ. 1500 స్కీమ్‌ల అమలుతో ప్రజల అభీష్టాలను నెరవేర్చనున్నామని పేర్కొన్నారు. అనంతరం మేకల కృష్ణ హితవు పలుకుతూ "ప్రజాస్వామ్యం అంటే అధికార దుర్వినియోగం కాదు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని గౌరవించాలంటే, ముందు దాన్ని ఉల్లంఘించిన వారిని శిక్షించడమే పూర్వాపరాల సత్యంగా నిలుస్తుంది," అన్నారు.

## తల్లికి వందనం అమలు.. కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**నెల్లూరు, జూన్ 16 (జనస్వరం) :** ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం కార్యక్రమం కింద రూ.15 వేలు అందించి వారి విద్యాభ్యాసానికి బాటలు వేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. నేడు రాష్ట్రంలో విద్యార్థుల తల్లిదండ్రుల కళ్ళల్లో సంతోషం నింపిన మంత్రి నారా లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. లక్షలాది మందికి మంచి చేస్తున్న సీఎం చంద్రబాబుపై, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌పై వైసీపీ నేతల తప్పుడు ప్రచారాలు సరికాదన్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి కింద 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇచ్చిందన్నారు. అలాగే గత ప్రభుత్వం రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే.. కూటమి ప్రభుత్వం రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. రూ.2 వేలు లోకేష్ జేబుల్లోకి పోయాయంటూ వైసీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారని, వైసీపీ పాలనలో రూ.13 వేలు ఇచ్చారని, మరి మిగతా రూ. 2 వేలు వైసీపీ నాయకుల జేబుల్లోకి పోయాయని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో కుటుంబంలో ఒక్కరికే ఈ పథకాన్ని అమలు చేశారని, కానీ నేడు ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ వర్తింప జేస్తున్నారన్నారు. లబ్ధి పొందిన వారిలో బీసీలు 29.82 లక్షల మంది, ఎస్సీ విద్యార్థుల 11.76 లక్ష ల మంది, ఎస్టీ విద్యార్థులు 4.26 లక్షల మంది, మైనారిటీ విద్యార్థులు 66500 మంది, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు 8.4 లక్షల మంది ఉన్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పారదర్శకత కు పెద్దపీట వేస్తూ అర్హత ఉన్న ప్రతి విద్యార్థికీ లబ్ధి చేకూరుస్తోందని చెప్పారు. ప్రతి విద్యార్థి చదువు కునేందుకు దోహదపడే విధంగా నేరుగా వారి తల్లి/సంరక్షకుని ఖాతాలో డబ్బులు వేస్తున్నారని వివరించారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి నిధులు ఎప్పుడు పడతాయా అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వేచి చూసేవారని, కానీ నేడు పాఠశాలలు ప్రారంభమైన రోజునే విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదు జమయ్యాయంటే విద్యార్థులపట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అలాగే ఒకటవ తరగతి లోను, ఇంటర్ ఫస్టియర్ లోను చేరే విద్యార్థులకు కూడా ఈ పథకం అమలు చేస్తారని చెప్పారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఇప్పటికే దీపం 2 పథకం కింద ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అందజేస్తున్నామని, 204 అన్న క్యాంటీన్ల ద్వారా పేదల కడుపు నింపుతున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకవైపు అభివృద్ధికి, మరో వైపు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు.

## బుద్ధ విగ్రహం కోరుతూ రిలే నిరాహార దీక్షలో తల్లి-బిడ్డ




**భైంసా, జూన్ 16 (జనస్వరం) :** ముధోల్ మండలం బోరిగాం గ్రామంలో బుద్ధ విగ్రహం పునః ప్రతిష్ఠను డిమాండ్ చేస్తూ ప్రారంభించిన రిలే నిరాహార దీక్ష సోమవారం 22వ రోజుకు చేరుకుంది. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ దీక్షను బుద్ధ అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. తల్లి, బిడ్డతో పాటు అంబేద్కర్ సంఘం సభ్యులు కూడా దీక్షలో పాల్గొంటూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్నం లేకుండా కూర్చున్నారు. "బోరిగాంలో బుద్ధ విగ్రహం ఏర్పాటు కావాలి" అనే నినాదాలతో ప్రభుత్వం దృష్టిని ఆకర్షించేందుకు కమిటీ సభ్యులు ప్రయత్నిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు దేవిదాస్ హస్డే, ట్రెజరర్ దాసరి రాజారాం, ఉమ్డే గంగాధర్, బోతే ఆనంద్ రావ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వమే బుద్ధ విగ్రహ ప్రతిష్ఠకు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ప్రతి తల్లికి నిజమైన 'తల్లికి వందనం' అందించాం

**ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్**



**మంగళగిరి, జూన్ 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విద్యా రంగంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది అంటూ ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రతీ తల్లికి నిజమైన 'తల్లికి వందనం' పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని చెప్పారు. పాఠశాలలు తెరచిన వెంటనే విద్యార్థుల కళ్లలో ఆనందం స్పష్టంగా కనిపించిందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో విద్యా రంగం గందరగోళంగా, అవినీతితో నిండిపోయిందని విమర్శించారు. 12 లక్షల మంది విద్యార్థులు చదువు మానేశారన్నదే గత ప్రభుత్వానికి తొలగని మచ్చగా మిగిలిందన్నారు. 'అమ్మఒడి' పేరిట కేవలం 42 లక్షల మందికి మాత్రమే మద్దతు ఇచ్చిన జగన్ ప్రభుత్వం కన్నా మెరుగ్గా, ఈసారి 67.27 లక్షల మందికి 'తల్లికి వందనం' ద్వారా మద్దతు అందించామని తెలిపారు. విద్యార్థుల తల్లులకు రూ.13,000 చొప్పున నేరుగా అందించడంతో పాటు, రూ.2,000ను కలెక్టర్ ఖాతాలో జమ చేసి, స్కూల్ కిట్లు, పాఠశాల అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు వివరించారు. ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా, ప్రతి ఒక్కరికి ఈ మద్దతు అందించడం వల్ల తల్లులు ఆనందంతో భద్రతతో పిల్లల్ని పాఠశాలలకు పంపిస్తున్నారన్నారు. జగన్ హయాంలోలా "ఒక బిడ్డని ఎంచుకోండి" అంటూ తల్లులను కృంగదీసే పని తాము చేయలేదన్నారు. వివరాల్లోకి వెళ్తే, 18.55 లక్షల ఒక్క బిడ్డ తల్లులు, 14.55 లక్షల ఇద్దరు పిల్లల తల్లులు, 2.10 లక్షల ముగ్గురు పిల్లల తల్లులు, 20,000 మందికి పైగా నలుగురు పిల్లల తల్లులు ఇలా మొత్తం 35,44,459 తల్లులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కలిగిందని వెల్లడించారు. అందులో 54,94,703 మంది విద్యార్థులు లబ్ధిపొందారని పేర్కొన్నారు. సామాజిక వర్గాలవారీగా వివరాలను వెల్లడించిన ఆయన 11.75 లక్షల ఎస్సీ, 4.26 లక్షల ఎస్టీ, 10.29 లక్షల బీసీ-ఏ, 6.75 లక్షల బీసీ-బీ, 8.62 లక్షల బీసీ-డి, 90 వేల కమ్మ, 4.52 లక్షల కాపు, 1.7 లక్షల రెడ్డి, 50 వేల ఆర్య వైశ్య, 66 వేల మైనార్టీ, 48 వేల ఈబీసీ, 13 వేల క్షత్రియ విద్యార్థులు లబ్ధిపొందినట్లు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను చెల్లించకపోవడంతో ?3,400 కోట్ల బకాయిలు మిగిలిపోయాయని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిని తీర్చుతోందని తెలిపారు. అలాగే విద్యార్థుల పై బరువైన పుస్తకాల భారం తగ్గించేందుకు లోకేష్‌గారి సూచనపై ప్రైమరీ తరగతుల టెక్స్ట్‌బుక్స్‌ను 52 నుంచి 32కి, సెకండరీ తరగతుల పుస్తకాలను 58 నుంచి 46కి తగ్గించినట్లు వివరించారు. అన్ని యాప్‌లను తొలగించి ఒకే ఒక ఏకీకృత యాప్‌ను తీసుకువచ్చిన మంత్రి లోకేష్ నిర్ణయం ఉపాధ్యాయుల ప్రశంసలు పొందిందని చెప్పారు. ఈ మార్పులన్నీ విద్యార్థుల మంచి కోసం తీసుకున్న నిర్ణయాలేనని, విద్యార్థులు రేపటి ధ్రువతారలుగా వెలుగులు విరజిమ్మాలని లోకేష్ ఆశయమని విజయ్ కుమార్ స్పష్టం చేశారు.

## వయోవృద్ధులకు భద్రత కల్పించాలి

**తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేత**




**పాలకొల్లు, జూన్ 16 (జనస్వరం) :** వయో వృద్ధుల పట్ల దూషణ, నిర్లక్ష్యం, శారీరక మానసిక, లైంగిక వేధింపులు, అదేవిధంగా ఆర్థిక దుర్వినియోగం అరికట్టాలని, వయోవృద్ధులకు భద్రత, శ్రేయస్సును, కల్పించాలని కోరుతూ, పాలకొల్లు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వయోవృద్ధులు, తాము ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ వై.దుర్గా కిషోర్‌కు సోమవారం అందజేశారు. సంఘ అధ్యక్షుడు వంగా నరసింహా రావు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ కు కూడా వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాఘం బాలకొండల రావు, అత్యం ఆదిశేషారావు, కొండ్రెడ్డి సూర్యనారాయణ, యర్రంశెట్టి వెంకటరత్నం, కారుమూరి దుర్గాప్రసాద్, డి.రామకృష్ణంరాజు, ఐడియల్ స్కూల్ సుబ్బారావు, రాయి సూరిబాబు, పోకల నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## గిరిజన రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

**చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ పుష్పలత**



**చింతపల్లి, జూన్ 16 (జనస్వరం) :** గిరిజన రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అందుతున్న విత్తన సబ్సిడీ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత సూచించారు. సోమవారం చిన్నగడ్డ సచివాలయంలో ప్రధానమంత్రి జన్ మన్ కార్యక్రమంలో భాగంగా గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో యువిఎస్ శ్రీనివాసరావు, జనసేన మండల ఉపాధ్యక్షుడు కిముడు కృష్ణమూర్తి (పండు) తదితరులతో కలిసి సర్పంచ్ పుష్పలత విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పివిటీజీ వర్గాల ప్రజలకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు మంజూరు చేయడం ద్వారా వారికి అధికారిక గుర్తింపు లభించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే గ్రామాలలో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల మరమ్మతులు, ప్రహరి గోడల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని వివరించారు. ప్రజలు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి కుమార్, పిసా కమిటీ ఉపాధ్యక్షులు రమణ, నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ రీమల చేతన్ వర్మ, కవడం సోమరాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మినీ టిప్పర్ లారీకి తప్పిన పెను ప్రమాదం



**చింతపల్లి, జూన్ 16 (జనస్వరం) :** మండల పరిధిలో మినీ టిప్పర్ లారీకి పెను ప్రమాదం తప్పిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గృహ నిర్మాణానికి అవసరమైన ఇసుకను రాజమండ్రి నుంచి తరలిస్తూ వస్తున్న లారీ, కొలపరి-పెద్దగడ్డ మధ్యలోని కాఫీ తోట సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన ఈ మినీ టిప్పర్ లారీ ఇసుకతో కూడుకొని చింతపల్లి వైపు వస్తుండగా, ఎదురుగా అధిక వేగంతో వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి జాతీయ రహదారి రక్షణ గోడను బలంగా ఢీకొట్టింది. దీంతో లారీ ముందు భాగం దెబ్బతిన్నప్పటికీ, డ్రైవర్ సహా అందరూ సురక్షితంగా బయటపడటంతో భారీ ప్రమాదం తప్పినట్లు ప్రయాణికులు తెలిపారు. అయితే, ఢీకొట్టిన ప్రభావంతో రహదారి రక్షణ గోడ శిథిలమైంది.

## జగన్ ఐదేళ్ల పాలనలో నాపై 25 అక్రమ కేసులు

**విజయవాడ ప్రత్యేక కోర్టుకు హాజరైన మంత్రి రామానాయుడు**



**విజయవాడ, జూన్ 16 (జనస్వరం) :** జగన్ ఐదేళ్ల పాలనలో తనపై 25 అక్రమ కేసులు బనాయించారని, మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సోమవారం విజయవాడ ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు మంత్రి రామానాయుడు హాజరయ్యారు. మళ్లీ ఈ నెల 23వ తేదీకి వాయిదా వేశారు. 2019 ఆగస్టులో వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లో నిర్భంధించిన ఆశ వర్కర్లకు న్యాయపరంగా అండగా నిలిచిన మంత్రి రామానాయుడుతో, పాటు పలువురు పార్టీ శ్రేణులపై, అప్పట్లో అక్రమ కేసులు పెట్టిన విషయం తెలిసిందే. అప్పటినుంచి గత ఐదేళ్లుగా విజయవాడ ప్రత్యేక కోర్టుకు మంత్రి హాజరవుతున్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, రెడ్ బుక్ గురించి వైసీపీ నాయకులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. తొలిసారి 2014లో, రెండోసారి 2019లో ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో ఎన్నికల కమిషన్‌కు తనపై ఒక్క ఎఫ్ఐఆర్, కేసు కూడా లేవని ఎన్నికల అఫిడవిట్ దాఖలు చేశానన్నారు. మూడోసారి 2024లో మాత్రం తనపై 25 కేసులు నమోదైనట్లుగా అఫిడవిట్ దాఖలు చేయాల్సి వచ్చిందన్నారు. 2019 నుంచి 2024 వరకు జగన్ ఐదేళ్ల పాలన కక్షలు, కేసులు, వేధింపులతో సాగిందనడానికి తనపై నమోదైన 25 అక్రమ కేసులే నిదర్శనమన్నారు. సత్యమేవ జయతేను నమ్ముకుని పనిచేస్తున్న పార్టీ మాదని, చివరకు సత్యమే గెలుస్తుందని మంత్రి రామానాయుడు చెప్పారు.

## జర్నలిస్టు పిల్లల చదువులకు భరోసా

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, జూన్ 16 (జనస్వరం) :** జిల్లాలో పనిచేస్తున్న పాత్రికేయుల పిల్లల చదువుకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో జర్నలిస్టుల మిత్రబృందం నంద్యాల జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందించాలని వినతి పత్రాన్ని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాత్రికేయుల పిల్లల ఫీజు రాయితీ విషయంలో ప్రభుత్వ జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు మీకు సహకారం అందిస్తారని భరోసానిచ్చారు. రానున్న రోజుల్లో ఫీజు రాయితీపైన విద్యాశాఖ అధికారులు సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి జనార్ధన్ రెడ్డిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లల భవిష్యత్తు కోసం ఉచిత విద్య అందించాలని జిల్లా కలెక్టర్ వారిని కోరగా, సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో ఈ విషయంపైన కలెక్టర్ ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉందన్నారు. జాతీయ కార్యదర్శి యలనాటి జాషువా మాట్లాడుతూ రానున్న రోజుల్లో పాత్రికేయుల సంరక్షణకు ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. కేవలం పాత్రికేయులకే కాకుండా ప్రజా సమస్యలపైన కూడా ఐరా పనిచేస్తుందని తెలిపారు. ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లెజెండ్ శ్రీను మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం, తమ హక్కుల సాధన కోసమే ఐరా పని చేస్తుందని, రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఐరా పనిచేస్తుందన్నారు. పాఠశాలలో ఫీజులు కట్టలేని కలం వీరులకు మేమంతా అండగా ఉంటూ వారి సంక్షేమం, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐరా రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్ బాబు, జిల్లా కార్యదర్శి రంగ, ఐఆర్ఏ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వాహనాలతో కిక్కిరిసిన చింతపల్లి ప్రధాన రహదారి



**చింతపల్లి, జూన్ 16 (జనస్వరం) :** మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వాహనాల రద్దీతో కిక్కిరిసిపోయింది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు రహదారి ఇరువైపులా ఏర్పాటు చేసుకున్న అక్రమ దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించాల్సిందిగా ఇటీవల ప్రజలకు సూచనలు జారీ చేశారు. దుకాణదారులలో కొందరు స్పందించి తమ దుకాణ షెడ్లను తొలగించినప్పటికీ, రహదారిపై వాహనాల ప్రవాహం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. చింతపల్లి, జీకే వీధి మండలాల పరిసర గ్రామాల నుంచి ద్విచక్ర వాహనదారులు, ప్రజలు తమ అవసరాల కోసం పెద్ద ఎత్తున చింతపల్లికి వస్తుండటంతో రోడ్డు మొత్తంగా వాహనాలతో నిండిపోతోంది. ముఖ్యంగా బుధవారం, ఆదివారాల్లో వాణిజ్య కార్యకలాపాలు పెరిగే వేళ ఈ రద్దీ తీవ్రతకు కారణమవుతోంది. పక్కనే ఉన్న చిన్నచిన్న దుకాణాల వద్ద కొనుగోలుల కోసం గుమిగూడే జనం, స్థిరంగా కదలని వాహనాలు కలిసిపోయి రహదారిపై అంతరాయంగా మారుతున్నాయి. ఫలితంగా వాహనదారులకు గమ్యస్థానాలకు చేరుకోవడం ఆలస్యం అవుతోంది. అధికారుల సూచనల మేరకు ప్రజలు మరింత చురుగ్గా స్పందించి పూర్తి స్థాయిలో సహకరిస్తేనే ట్రాఫిక్ సమస్యకు తాత్కాలిక పరిష్కారం సాధ్యమవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## 'వెన్నుపోటు' పుస్తకం ఆవిష్కరణ



**పులివెందుల, జూన్ 17 (జనస్వరం) :** కడప నగరంలోని రాజంపేట రోడ్డులోని మేడ కన్వెన్షన్ హాలు నందు జరిగిన వైఎస్సార్ జిల్లా సర్వసభ్య సమావేశంలో రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల వెన్నుపోటు అనే పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రారెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, కడప మాజీ ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురాం రెడ్డి, ఎమ్మెల్సీలు పొన్నపరెడ్డి రామ సుబ్బారెడ్డి, డీసీ గోవింద రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ నరేన్ రామానుజుల రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, జిల్లా జడ్పీ చైర్మన్ రామ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా మాధురి



**పాలకొల్లు, జూన్ 16 (జనస్వరం) :** స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్‌గా యర్రా మాధురి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించే విషయంలో పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ని ఆదర్శంగా దిద్దుతామని తెలిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు సూచించిన విధంగా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తానని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓం.. భీమ్.. క్రీమ్.. ఫట్..

**- ఇది మాంత్రికుల తంత్రం**

**- నేడు గారడీ విద్య దినోత్సవం**



**పులివెందుల జూన్ 16 (జనస్వరం) :** ఓం భీమ్ క్రీం ఫట్ అంటే మాంత్రికుల తంత్రం అని అర్థం. ఇది ఒక విద్య.. ఒక కళ అని కూడా చెప్పవచ్చు. ప్రజలను ఆశ్చర్యపరిచే రీతిలో ప్రదర్శించే ఒక కళ. ఈ విద్యనే మాయాజాలం, హస్తచాతుర్యం, మానసిక ఆటలు కలగలిపిన వినోదపద కళారూపం అని కూడా పిలుస్తారు. ఈ గారడీ విద్యపై అవగాహన కల్పించడం కోసం ప్రతి ఏటా జూన్ 17న గారడీ దినోత్సవం జరుపుకుంటారు. ఇది పూర్వకాలం నుండి మనిషి లోతైన కోరిక అసాధ్యాన్ని సుసాధ్యం చేయాలనే భావనకు అర్థాన్ని సూచిస్తుంది. భారతదేశంలో గారడీ విద్యకు పురాతన చరిత్ర ఉంది. పీసీ సాకర్ వంటి ప్రముఖ మాంత్రికులు ప్రపంచవ్యాప్తంగా గౌరవాన్ని చాటారు. వందలాది గ్రామీణ మాంత్రికులు తమ జీవనోపాధిగా ఈ కలను కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే భారతదేశంలో ఇది పెద్దగా అధికారికంగా గుర్తించబడిన దినోత్సవం మాత్రం కాదు. కొన్ని దేశాలలో మాయాజాల ప్రదర్శనలకి సంబంధించిన సమాజంలో ఇది ఒక ప్రత్యేకమైన రోజు. గారడీ కళను గౌరవించడం. మాంత్రికుల కృషిని గుర్తించడం. పిల్లలు పెద్దలందరికీ వినోదాన్ని అందించడానికి ప్రేరణ కలిగించడం గారడి విద్య దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. గారడి విద్య మనకు కేవలం వినోదం మాత్రమే అనిపించినప్పటికీ, తెర వెనుక చాలా కృషి, అంకితభావం ఉంది ఎందుకంటే ఈ కళకు ప్రత్యేక నైపుణ్యం, క్రమశిక్షణ, అంకితభావం, నిపుణులు కళలో ప్రావీణ్యం సంపాదించడానికి చాలా సాధన అవసరం. గారడీ చేయడం, గారడీ చేయడాన్ని ప్రోత్సహించడం, గారడీ చేసేవారిని ఒకచోట చేర్చి సంబరాలు చేసుకోవడం వంటి వాటిని ప్రజలకు నేర్పించే ఉద్దేశ్యంతో, ప్రపంచ గారడీ దినోత్సవం అభిరుచికి వార్షిక గుర్తింపు దినంగా రూపొందించబడింది.

**గారడీ వల్ల కలిగే ప్రయోజనాలు :**

గారడీ చేయడానికి చాలా ఏకాగ్రత అవసరం కాబట్టి, ఇది మీ మనస్సును అన్ని ఇతర చింతలు, ఉద్రిక్తతల నుండి దూరంగా ఉంచుతుంది. ఆ విధంగా ఇది గొప్ప ఒత్తిడిని తగ్గించేది. రెండవది, ఇది ముఖ్యంగా పిల్లలలో ఆత్మగౌరవాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. మీరు ఏదైనా అసాధారణంగా చేసినప్పుడు, మీరు మీ కంఫర్ట్ జోన్ వెలుపల పనులు చేయగలరనే భావనను అభివృద్ధి చేస్తారు. గారడీ చేయడం ఆత్మగౌరవాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. చివరగా, గారడీ చేయడం ఒకరి మెదడును అప్రమత్తంగా ఉంచడంలో సహాయపడుతుందని న్యూరోసైన్స్ అధ్యయనాలు సూచిస్తున్నాయి.

## సంక్షేమానికి మారుపేరు టీడీపీ

**గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్**



**మంగళగిరి, జూన్ 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** "సంక్షేమానికి నిజమైన నిర్వచనం తెలుగుదేశం పార్టీ" అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేపట్టిన 'తల్లికి వందనం' పథకం రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సాహ వాతావరణాన్ని సృష్టించిందని చెప్పారు. "జగన్ రెడ్డి పాలనలో తల్లిని అడిగి, ఏ పిల్లవాడిని చదివిస్తావో చెప్పి ఒత్తిడి తెచ్చారు. కానీ, నేడు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఇంట్లో ఉన్న ప్రతీ విద్యార్థికీ చదువునిచ్చే విధంగా తల్లికి వందనం అమలు అవుతోంది. ఇది వైసీపీకి మరణశాసనంగా మారింది," అని నసీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అమ్మఒడి కింద రూ.24 వేల కోట్లను ఖర్చు చేసినా, కేవలం 42 లక్షల మందికే మద్దతు అందించిందని, కూటమి ప్రభుత్వం మాత్రం ఒక్క ఏడాదిలోనే రూ.10,091 కోట్లు ఖర్చు చేసి 67 లక్షల 27 వేల మంది విద్యార్థులకు తల్లికి వందనం ద్వారా లబ్ధి చేకూర్చిందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన తొలి రోజే 4.81 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.718.95 కోట్లు నేరుగా జమ చేసిన ఘనత కూడా కూటమిదే అన్నారు. పాఠశాలలు తెరచిన రోజే స్కూల్ బ్యాగులు, కిట్లు అందజేయడం ద్వారా మంత్రి నారా లోకేష్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో ఒక కొత్త ఒరవడి నెలకొల్పారని తెలిపారు. "పిల్లలు పనిలో కాకుండా బడిలో ఉండాలన్నదే చంద్రబాబు గారి సంకల్పం. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా, అందరికీ రూ.13,000 చొప్పున నిధులు జమ చేశాం. ఒక్కొక్క ఇంటికి రూ.26 వేలు, రూ.39 వేలు, ఐదుగురు పిల్లల కుటుంబాలకు రూ.65 వేలు కూడా జమ చేసిన ఘనత మాకు దక్కింది. 12 మంది పిల్లల కుటుంబానికి రూ.1.56 లక్షలు జమచేసిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఇది దేశ చరిత్రలోనే ఏ ప్రభుత్వం చేయని రీతిలో అమలు చేసిన పథకం" అని ఆయన వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం ఒక్క విద్యార్థికే రూ.15 వేలు ఇస్తామని చెప్పి, చివరికి మాట తప్పిందని విమర్శించారు. "నేడు నారా లోకేష్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఒకప్పుడు ఒక బిడ్డనే చదివించగలిగిన తల్లులు, ఇప్పుడు తమ ఇంట్లోని అన్ని పిల్లల్ని చదివించే స్థితిలో ఉన్నారు. ఇది తల్లికి వందనం పథకం విజయం," అని నసీర్ అభిప్రాయపడ్డారు. ముస్లిం మైనారిటీలు కూడా ఈ పథకంలో భారీగా లబ్ధి పొందారని, వైసీపీ హయాంలో 3.12 లక్షల మందికే రూ.468 కోట్లు మాత్రమే ఇచ్చినట్లు, కూటమి ప్రభుత్వం మాత్రం 4.81 లక్షల మందికి రూ.718.95 కోట్లు మంజూరు చేసిందని వివరించారు. మైనార్టీల్లో 54 శాతం అదనపు లబ్ధిదారులు ఈసారి పొందారని వెల్లడించారు. "వాస్తవాలు స్పష్టంగా ప్రజల ముందున్నా, వైసీపీ నేతలు తప్పుడు లెక్కలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ప్రజలు తెలివిగా వ్యవహరిస్తూ వైసీపీని భూస్థాపితం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల్లో నమ్మకం పెరిగింది. ఇది ప్రజారంజక పాలనకు నిదర్శనం," అని నసీర్ అహ్మద్ స్పష్టం చేశారు.

# వడ్డెరల అభివృద్ధికి కూటమి కృషి

- ఓడి చెరువులో రూ.80 లక్షలతో కమ్యూనిటీ భవనం మంజూరు
- ప్రభుత్వ భూముల పరిరక్షణ, జీన్స్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు



**ఓడిచెరువు, జూన్ 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** వడ్డెర సామాజిక వర్గాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఓడి చెరువు మండలంలోని సున్నంపల్లి పంచాయతీలో రూ.80 లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని హిందూపురం ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి డా. పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం వారు కలిసి నిర్మాణానికి కేటాయించిన సర్వే నెం. 785/1 భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెరల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి కట్టుబాటుతో ఉందన్నారు. సామాజికంగా, విద్యాపరంగా వడ్డెర యువతను ముందుకు తీసుకురావడానికి కమిటీని ఏర్పాటు చేసి, అన్ని విధాలా సహకరిస్తామన్నారు. కమ్యూనిటీ భవనం కేంద్రంగా స్వయం ఉపాధికి అవసరమైన శిక్షణలు, కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు తెలిపారు.

**ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు :**
అనంతరం మండలంలోని ప్రభుత్వ భూముల పరిస్థితిపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన డా. రఘునాథ్ రెడ్డి, ఎంకొత్తపల్లి, వెంకటాపురం, ఇనగలూరు, అల్లాపల్లి, ఓడి చెరువు పంచాయతీలలో అనేక స్థలాలు ప్రభుత్వానికి చెందాయని వెల్లడించారు. ఈ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడి ప్రజాప్రయోజనాల కోసం వినియోగిస్తామని స్పష్టం చేశారు. పాత జగన్ ప్రభుత్వం మంజూరు చేసిన ఓడి చెరువు అతోటపల్లిలోని జగనన్న కాలనీలో కేవలం 35 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారని, మిగిలిన స్థలాలను రద్దు చేసి అర్హులైన వారికి కొత్తగా 3 సెంట్ల స్థలాలు, ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు.

**జీన్స్ ప్యాక్టరీలకు ముందుకు వచ్చిన కంపెనీలు :**
ఓడి చెరువు పంచాయతీలో వేమారెడ్డిపల్లిలో సర్వే నెం. 360లో ఉన్న భూమిలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు ప్రారంభించామని చెప్పారు. జీన్స్ తయారీ కంపెనీలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చాయని, అవసరమైన భూమిని కేటాయించి ఉద్యోగావకాశాలను కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

**బాధితులను పరామర్శించిన మాజీ మంత్రి :**
ఇదిలా ఉండగా, బీసీ కాలనీలో గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త రహంతుల్లా (65) కుటుంబాన్ని మాజీ మంత్రి పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే డయాలసిస్ రోగి రామాంజనేయులు కుటుంబానికి కూడా ప్రగాఢ సహానుభూతితో ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఓడి చెరువు మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుల్ రెడ్డి, తుమ్మల మహబూబ్ బాషా, ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ శంకర్ రెడ్డి, ఎల్ఐసి నర్సింహులు, శివా రెడ్డి, బోరు రమణ, పీట్ల సుధాకర్, జౌళి బాబా, కంచి సురేష్, జౌళి శీను నాయక్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జమ్ములమడుగు పట్టణ టీడీపీ పరిశీలకునిగా రవికుమార్



**పులివెందుల, జూన్ 17 (జనస్వరం) :** కడప జిల్లా జమ్మలమడుగు పట్టణ టీడీపీ పరిశీలకునిగా వేంపల్లెకు చెందిన గిరిజన కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మేదర రవికుమార్ నియమితులయ్యారు. ఆయన ఎంపిక పట్ల వేంపల్లె టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో అభినం దనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన నియామం పట్ల సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కడప జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులు రెడ్డి, పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి, రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, వేంపల్లె మండల నాయకులకు, సహకరించిన వారందరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేశారు. జమ్మలమడుగు పట్టణంలో టీడీపీ బలోపేతానికి సాయశక్తులా కృషి చేస్తానని మేదర రవికుమార్ తెలిపారు.

## పల్నాడు జిల్లా మాచర్లలో వరల్డ్ వెల్ బీయింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా



**మాచర్ల, జూన్ 16 (జనస్వరం) :** నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలను అందించేందుకు గ్లోరియా ఆఫ్ ఆసియా అవార్డు విజేత, ఐఎస్ఓ సర్టిఫైడ్ సంస్థ అయిన వరల్డ్ వెల్ బీయింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ సాంబేలు శాంతి బాయి ప్రకటించారు. ఈ జాబ్ మేళా జూన్ 23న సోమవారం ఉదయం 9 గంటలకు ఎస్‌కెబీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు. టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, పీజీ వంటి విద్యార్హతలున్న నిరుద్యోగులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన టెక్ మహీంద్రా, జిఎంఆర్ ఎయిర్ పోర్ట్, కోటక్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, మెట్రో, పేటీఎం, జస్ట్ డయల్, బ్లింక్ ఇట్, కాప్స్టోన్, అక్షర ఎంటర్‌ప్రైజెస్, ష్నైడర్ ఎలక్ట్రానిక్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఇందులో భాగంగా పాల్గొననున్నాయి. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించిన డాక్టర్ శాంతిబాయి, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరవ్వాలని కోరారు. ఎన్రోల్ కావాలనుకునే వారు 9885398475 లేదా 8142656530 నంబర్లలో సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ అవకాశాన్ని యువత పూర్తిగా వినియోగించుకొని భవిష్యత్‌ను నిర్మించుకోవాలన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి గోయల్



**తిరుమల, జూన్ 16 (జనస్వరం) :** కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్ సోమవారం వేకువ జామున తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అమరావతి పర్యటనకు ఆదివారం రాష్ట్రానికి చేరుకున్న కేంద్ర మంత్రి గోయల్ కుటుంబ సమేతంగా ఆదివారం రాత్రి తిరుపతికి చేరుకున్నారు. ఆయనకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు తుడా చైర్మన్ "డాలర్స్" దివాకర్ రెడ్డి విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. తిరుమలలో కేంద్రమంత్రి కుటుంబానికి టీటీడీ చైర్మన్ బొల్లినేని రాజగోపాల్ (బి.ఆర్) నాయుడు, ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యుడు గుడిపల్లి భానుప్రకాష్ రెడ్డిలు స్వామివారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలను రంగనాయక మండపంలో అందించారు.

## తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ



**కోవూరు, జూన్ 16 (జనస్వరం) :** కోవూరు తహసిల్దార్ కార్యాలయంలో ఆదివారం తహసిల్దార్ సుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రజా విజ్ఞప్తులను స్వీకరించారు. మండలానికి చెందిన ప్రజలు భూముల కబ్జాలు, సాగునీటి కాలువల సమస్యలు, రెవెన్యూ సంబంధిత సమస్యలపై తహసిల్దార్‌కు వినతిపత్రాలు సమర్పించారు. స్థానిక టీడీపీ నాయకులు, పెన్న డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి కలిసి తహసిల్దార్ సుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. కోవూరు మండలంలో సాగునీటి కాలువలు అనధికారికంగా ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రజా విజ్ఞప్తులగా వచ్చిన ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరేటి శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీహరి, ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారి దర్శనానికి సెప్టెంబర్ నెల కోటా విడుదల

**తిరుమల, జూన్ 16 (జనస్వరం) :** తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన సెప్టెంబర్ నెల కోటాను ఈనెల 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ – సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు ఈనెల 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి.

**21న ఆర్జిత సేవా టికెట్ల విడుదల :**
కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 21న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అలాగే వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను కూడా 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**23న అంగప్రదక్షిణం టోకెన్లు :**
అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వీటితో పాటు శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆన్ లైన్ కోటాను కూడా 23వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.

**వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా :**
వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల :**
ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల :**
తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

**25న శ్రీవారి సేవా ఆగస్టు నెల కోటా విడుదల :**
శ్రీవారి సేవ(తిరుమల మరియు తిరుపతి), పరకామణి సేవ, నవనీత సేవ, గ్రూప్ సూపర్వైజర్ల సేవల ఆగస్టు నెల కోటాను 25న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. టీటీడీ వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు.

## ముగిసిన అంతరాష్ట్ర యూనిటీ చింతపల్లి సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్



**చింతపల్లి, జూన్ 16 (జనస్వరం) :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నెల రోజుల పాటు ఉత్సాహంగా సాగిన అంతర్రాష్ట్ర యూనిటీ చింతపల్లి సీజన్-3 క్రికెట్ కప్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. మొత్తం 65 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో హనుమాన్ జిమ్ టీమ్ ఫైనల్ మ్యాచ్‌లో సీసీసీ జట్టును ఓడించి కప్‌ను కైవసం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో ప్రదర్శనతో ఆకట్టుకున్న హనుమాన్ జిమ్ టీమ్ కెప్టెన్ పి. లోవరాజు విజేతల ట్రోఫీతో పాటు రూ.75,000 నగదు బహుమతిని అందుకున్నారు. రెండో స్థానంలో నిలిచిన సీసీసీ జట్టు కెప్టెన్ డి.చినబాబు ట్రోఫీతో పాటు రూ.35,000 నగదు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు వేడుకల్లో నిర్వాహకులు దొండ చినబాబు, మండి భూషణం, గోవింద్, లోకేష్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. క్రీడల ద్వారా యువతలో అనుకరణీయమైన ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, ఇలాంటి టోర్నమెంట్లు వారిలో నైపుణ్యాలను వెలికితీయడంలో కీలక పాత్ర వహిస్తాయని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విజేత జట్టుకు అభినందనలు తెలుపుతూ, రానున్న రోజుల్లో మరిన్ని రాష్ట్ర స్థాయి టోర్నీలు నిర్వహించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని నిర్వాహకులు తెలిపారు.

## తుడా అభివృద్ధిలో వీసీగా మౌర్య సేవలు భేష్



**తిరుపతి, జూన్ 16 (జనస్వరం) :** తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడ) వైస్ చైర్మన్‌గా మున్సిపల్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య అందించిన సేవలు భేష్ అని తుడా చైర్మన్ "డాలర్స్" దివాకర్ రెడ్డి ప్రశాంశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తుడా వీసిగా తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సల్ నియామకం కావడంతో ఇదివరకు తుడా వీసీగా ఉన్న మౌర్య సోమవారం రిలీవ్ అయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం తుడా కార్యాలయంలో మౌర్యకు ఘన సన్మానం చేపట్టారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఆమెకు దుశ్శలువాలతో సత్కరించి శ్రీవారి విగ్రహాన్ని బహుకరించారు. తుడా అభివృద్ధికి విసిగా మౌర్య చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు.

## మత్స్యకారుల మృతి వార్త దిగ్భ్రాంతి కలిగించింది

### ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సంతాపం



**అవనిగడ్డ, జూన్ 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** మత్స్యకారుల మృతి వార్త దిగ్భ్రాంతి కలిగించిందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం అవనిగడ్డలోని తమ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నాగాయలంక మండలం గుల్లలమోదకు చెందిన నాగిడి రాము, సంగమేశ్వరానికి చెందిన తమ్ము పోతురాజు అనే మత్స్యకారులు కోనసీమ జిల్లా అంతర్వేది వద్ద జరిగిన బోటు ప్రమాదంలో నదిలో గల్లంతై ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అన్నారు. అధికారులు సహాయక చర్యలు వేగవంతం చేయాలని, క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. మృతులకు తన ప్రగాఢ సంతాపం, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## శతావధాని భరత్ శర్మ ప్రవచనం అనుసరణీయం

### బీజేపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు



**తిరుపతి, జూన్ 16 (జనస్వరం) :** సుందరకాండ సకల సౌభాగ్యదాయకమని, హనుమంతుని అనుగ్రహం చేత ఏదైనా సాధించే శక్తిని పొందగలమని ప్రవచనకర్త శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాలకు చెందిన అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సుందరకాండ – హనుమద్వైభవం గురించి శతావధాని ఉప్పల ధడియం భరత్ శర్మ స్థానిక అన్నమాచార్య కళామందిరంలో ఆధ్యాత్మిక ప్రవచనం చేయడం మనకు అనుసరణీయమని బీజేపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుండాల గోపినాథ్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా, రామాయణ మాహాత్మ్యం, రామాయణంలో సుందరకాండ విశిష్టత, హనుమంతుని చాకచక్యం, శ్రీరాముని కార్యంపై హనుమంతుని దీక్ష, సుందరకాండలోని అంతరార్థం, నేటి సమాజంలో ఇతిహాసాల అన్వయం మొదలైన విశేషాలను అవధాని భరత్ శర్మ తెలియజేసారు. నాటి మహర్షుల వాఙ్మయం మొత్తం వైజ్ఞానికమే అని, అది ప్రస్తుత సమాజంలోని మానవుని జీవనానికి సుఖప్రదమైన మార్గాన్ని నిర్దేశిస్తుందని తెలియజేశారు. ప్రవచనం ప్రారంభంలో ప్రవచన కర్త భరత్ శర్మ ను రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కళాకారులు టీచర్ తిరుమలయ్య, ప్రభాకర్ నాయుడు, సుబ్రమణ్యం రెడ్డి, సురేష్ స్వామి, తదితరులు శాలువాతో సన్మానించారు. కాగా ప్రవచన కర్త భరత్ శర్మ భారతీయ విద్యా భవన్ పూర్వ విద్యార్థి కావడంచేత ప్రవచనాన్ని వీక్షించడానికి, ఆ పాఠశాల డైరెక్టర్ డా ఎన్ సత్యనారాయణ రాజు హాజరయ్యారు.

## ఎంపీ పాకాను మర్యాదపూర్వకంగా కలిసిన కైకలూరు గౌడ సంఘం



**కైకలూరు, జూన్ 16 (జనస్వరం) :** ఇటీవల రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం స్వీకారం చేసిన పాకా సత్యనారాయణను సోమవారం భీమవరం పట్టణంలోని ఆయన నివాసం వద్ద రాష్ట్ర గౌడ సంఘ నాయకులు పోసిన చెంచు రామారావు ఆధ్వర్యంలో కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ఎంపికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఎంపీని కలిసినవారిలో రాష్ట్ర నాయకులు పరసా ఏడుకొండలు, నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షులు పోలగాని నాగరాజు, చేబ్రోలు శ్రీనివాస్, బొర్రా సత్యనారాయణ, మారగాని గణపతి, దాసరి శ్రీనివాస్, కట్టా అంజయ్య, వీరంకి సత్యనారాయణ, నితిన్ సామ్రాట్, అనగాని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ జిల్లా యువజన విభాగ కార్యనిర్వాహక సభ్యుడిగా చల్లా సునీల్ కుమార్ నియామకం



**పులివెందుల, జూన్ 16 (జనస్వరం) :** వైఎస్ఆర్ కడప జిల్లా వైసీపీ యువజన విభాగ కమిటీకి కొత్త కార్యనిర్వాహక సభ్యుడిగా వేముల మండలం బచ్చయ్యగారిపల్లికి చెందిన చల్లా సునీల్ కుమార్‌ను నియమించారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో ఈ నియామకం జరిగిందని పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. సునీల్ కుమార్ వేముల ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ కుమారుడిగా, కుటుంబ పరంపరగా పార్టీలో విశ్వాసాన్ని కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. నియామకానంతరం స్పందించిన ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌కి, ఎంపీ అవినాష్ రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డికి, వేముల మండల కన్వీనర్ నాగెళ్ళ సాంబశివరెడ్డికి, జడ్పీటీసీ కోక టం వెంకట బయపు రెడ్డికి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆదిత్య రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం నిస్వార్థంగా పనిచేసి, సమన్వయంతో యువతను కలుపుకొని 2029 ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేందుకు కృషి చేస్తానని, వైఎస్ జగన్‌ని మరో సారి సీఎం పీఠంపై ఆసీనులే చేయడమే లక్ష్యమని వెల్లడించారు.

## మత్స్యకాయిల కుటుంబాలకు కూటమి ప్రభుత్వ పరిరక్షణ

### ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం

**అంతర్వేది/నాగాయలంక, జూన్ 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** కృష్టాజిల్లా నాగాయలంక మండలానికి చెందిన ఇద్దరు మత్స్యకారులు గుల్లదామోదర గ్రామానికి చెందిన నాగిడి రాము, సంగమేశ్వర గ్రామానికి చెందిన తమ్ము పోతురాజు జీవనోపాధి కోసం సముద్రంలో చేపల వేటకు వెళ్లి, అంతర్వేదిలో బోటు నుంచి జారిపడి దురదృష్టవశాత్తూ మృతిచెందారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మృతుల కుటుంబాలకు అండగా నిలిచింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నుంచి తక్షణమే పరిహారం ప్రకటించింది. ఒక్కో మృతుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5 లక్షలు, మత్స్యశాఖ ద్వారా అదనంగా మరో రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.10 లక్షల పరిహారం మంజూరు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ "ప్రభుత్వం మత్స్యకారుల పట్ల సంపూర్ణ చిత్తశుద్ధితో సహానుభూతితో ఉండబోతుంది. తమ ప్రాణాలను పణంగా పెట్టి సముద్రంలో జీవితాన్ని కొనసాగించే వీరి కుటుంబాలకు ప్రభుత్వం భరోసా ఇస్తుంది" అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మత్స్యకారులకు సమయానుకూల సూచనలు, సురక్షితంగా సముద్రంలో వేట చేయడం కోసం జాగ్రత్తలు, అవసరమైన పరికరాల వాడకం మొదలైన అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. ఈ పరిహారంతో మృతుల కుటుంబాలకు కొంతమేర సాంత్వన లభించిందని స్థానికులు పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని మరోసారి ఈ చర్య ద్వారా రుజువైందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజావినతి కార్యక్రమం

### సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నేతలు



**మంగళగిరి, జూన్ 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నుండి పలు సమస్యలపై బాధితులు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. మంగళవారం జరిగిన ప్రజావినతి కార్యక్రమంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుంటూరు డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు పాల్గొన్నారు. వారు ప్రజల నుండి వచ్చిన వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకునేలా కృషి చేశారు. ప్రజల తరఫున ఉన్నతాధికారులకు ఫోన్ చేసి సమస్యలు రిపీట్ కాకుండా శాశ్వత పరిష్కారాలు చూపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వివరించారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని కాలూరు గ్రామానికి చెందిన ఎం. వెంకటమ్మ వైసీపీకి చెందిన ప్రతాప్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, దేవరాజ్ లు తమ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి, ప్రవేశించకుండా ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేశారు.

– పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం యలమంద గ్రామానికి చెందిన పోలా వెంకటేశ్వర్లు కోర్టు కేసు నడుస్తున్న భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, కోర్టు తీర్పు వచ్చే వరకు వాటిని ఆపాలని విజ్ఞప్తి చేశారు.

– శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరు గ్రామానికి చెందిన ఏ. భాస్కర్ నాయుడు తన తండ్రి పేరుమీద ఉన్న ఇంటి స్థలాన్ని అరుంధతి వాడకు చెందిన వైసీపీ నాయకులు ఆక్రమించారని తెలిపారు. సత్యసాయి జిల్లా కదిరి మండలం సైదాపురం గ్రామానికి చెందిన డి. సిద్దప్ప తమ తాతల భూమిని ఈదల వెంకటరమణ అనే వ్యక్తి ఆక్రమించాడని ఫిర్యాదు చేశారు.

– నెల్లూరు జిల్లా జలదంకి మండలం గట్టుపల్లె చెంతళపాలెం గ్రామానికి చెందిన సదాశివరావు – తలశీల వెంకట నరసింహారావుతో వ్యక్తిగత ఆర్థిక లావాదేవీలు ఉన్నప్పటికీ, ఆ కారణంగా తమ తోటలోకి అక్రమంగా చొరబడి పంటను కోసుకెళ్లాడని తెలిపారు. దీనిపై కేసు కూడా నమోదైందని, రాజకీయ జోక్యం లేకుండా న్యాయం చేయాలని కోరారు.

– ప్రకాశం జిల్లా కంభం మండల కాగితాలగూడెం గ్రామానికి చెందిన మిచ్చనగట్ల వెంకటేశ్వర్లు బిజ్జాల కుటుంబానికి చెందిన ముగ్గురు తమ భూమిని ఆక్రమించడమే కాకుండా, దాడి చేశారని ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా యడ్లపాడు మండలం తుర్లపాడు గ్రామానికి చెందిన టూబాటి సుబ్బారావు తనకు పిత్రార్జితంగా వచ్చిన భూమిని కొందరు ఆక్రమించారని, సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రజలు ఎన్నో ఆశలతో పార్టీ కేంద్రానికి వస్తున్నారని, ప్రతి అర్జీకి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ తొలి బాధ్యతగా పేర్కొన్నారు.

## నెరవేరబోతున్న మంత్రి నారాయణ మహాసంకల్పం

- నెల్లూరు వీఆర్‌సి స్కూల్లో ఆధునీకరణ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ కుమార్తె పొంగూరు షరణి
- 23న వీఆర్ హైస్కూల్ పునః ప్రారంభం
- ఒక్క రోజులోనే వెయ్యి మందికి అడ్మిషన్లు
- 85 శాతం వీఆర్ హైస్కూల్లో ఆధునీకరణ పనులు పూర్తి



**నెల్లూరు, జూన్ 16 (జనస్వరం) :** నిరుపేద విద్యార్థులకు అధునాతన సాంకేతికతతో డిజిటల్ విద్యను అందించాలన్న మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మహా సంకల్పం మేరకు నిర్మిస్తున్న వీఆర్ హై స్కూల్ ఆధునీకరణ పనులు 85 శాతం మేర పూర్తయినట్లు మంత్రి కుమార్తె షరణి తెలిపారు. నెల్లూరు వీఆర్ హైస్కూల్లో జరుగుతున్న డిజిటల్ ఎక్విప్ మెంట్ ను మంత్రి నారాయణ కుమార్తె షరణి సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. తరగతి గదుల్లో ఏర్పాటు చేయాల్సిన ఫర్నిచర్, పెయింట్స్‌పై ఆమె పలు సూచనలు చేశారు. వీఆర్ హైస్కూల్‌కి నియమించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో షరణి మాట్లాడారు. గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న స్పోర్ట్స్, ప్లే ఎక్విప్‌మెంట్‌ను ఆమె పరిశీలించారు. తమ పిల్లల కోసం విశేషంగా కృషి చేస్తున్న షరణికి అడ్మిషన్ల కోసం వచ్చిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పొంగూరు షరణి మాట్లాడుతూ వీఆర్ స్కూల్ ఆధునీకరణ బాధ్యత తీసుకోవటం సంతోషంగా ఉందన్నారు. ఆధునీకరణ పనులు చివరిదశకు వచ్చాయని తెలిపారు. పేద పిల్లలకు మంచి చదువు అందించాలని తల్లిదండ్రులు ఆశపడతారని, కానీ ఆర్థిక పరిస్థితుల వల్ల వారు రాజీపడుతున్నారు. అటువంటి వారి కోసమే మంత్రి నారాయణ వీఆర్ హైస్కూల్‌ను ఆధునీకరిస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో వీఆర్ హై స్కూల్ సిద్ధం అవుతోందన్నారు. జూన్ 23న స్కూల్ ప్రారంభం జరుగుతుందని తెలియజేశారు. కేవలం ఒక్క రోజులోనే అడ్మిషన్స్ క్లోజ్ అయ్యాయన్నారు. ఇప్పటికీ కొంత మంది పేరెంట్స్ అడ్మిషన్స్ కోసం వస్తున్నారని తెలిపారు. రూమ్స్ కెపాసిటీ మేరకే అడ్మిషన్స్ జరిగాయని చెప్పి పంపుతున్నామన్నారు. డిజిటల్ విద్య లక్ష్యంగా క్లాస్ రూమ్స్ సిద్ధం అవుతున్నాయని చెప్పారు. చదువుల్లో పిల్లలకు ఏకాగ్రత కుదిరేలా క్లాస్ రూమ్స్ ని తీర్చి దిద్దుతున్నామని స్పష్టం చేశారు. నర్సరీ నుంచి 9వ తరగతి వరకు తొలి ఏడాది అడ్మిషన్స్ జరిగాయన్నారు. భవిష్యత్తులో ఇంటర్ వరకు ఇక్కడే చదివే అవకాశం కల్పించబోతున్నామని తెలిపారు. ఎంతోమంది పేదపిల్లలు వీఆర్ హై స్కూల్ నుంచి ఉన్నత స్థాయికి వెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మా నాన్న నారాయణ సంకల్పం ఖచ్చితంగా నెరవేరుతుందని పొంగూరు షరణి తెలిపారు.


## ఇందిరమ్మ కాలనీలో పేదల ఇంటి స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మాణం దారుణం

### కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో లబ్ధిదారుల ధర్నా




**ఏలూరు, జూన్ 16 (జనస్వరం) :** పేదల కోసం కేటాయించిన ఇంటి స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మాణానికి పాలుపడడం దారుణమని మండవల్లి తరుగుమూల ఇందిరమ్మ కాలనీ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం వారు ఏలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి ప్రభుత్వ తీరును తీవ్రంగా నిరసించారు. లబ్ధిదారులు ప్రదర్శనలో "మా స్థలాల్లో పోలీస్ స్టేషన్ వద్దు", "పూడిక చేసిన స్థలాల్లో ప్రభుత్వమే ఇండ్లు కట్టాలి" అంటూ నినాదాలు చేశారు. 2006లో అప్పటి ప్రభుత్వం కేటాయించిన 131 ఇళ్ల స్థలాలను ఇప్పటికీ మెరక చేయకపోవడాన్ని, పట్టాలు ఇవ్వకపోవడాన్ని వారు తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ, 20 ఏళ్లుగా పేదల స్థలాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, విద్య, ఆరాధన, సంఘ కార్యాలయాల కోసం 40 సెంట్లు కామన్ స్థలంగా గుర్తించి వదిలివేసిన స్థలాన్ని పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించడం అన్యాయమన్నారు. పేదల స్థలాలపై ప్రభుత్వ నిస్సంగత వ్యవహారంతో ఇప్పటికీ ఒక్క ఇంటి నిర్మాణం కూడా జరగలేదని, ఇప్పుడు అకస్మాత్తుగా పంచాయతీ ముసుగులో తీర్మానం చేసి పోలీస్ స్టేషన్ నిర్మాణం ప్రారంభించడం వెనుక రాజకీయ ప్రయోజనాలున్నాయని ఆరోపించారు. అధికారుల గుట్టుచప్పుడు కాకుండా తీసుకున్న నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ వద్ద "నీ కోసం"లో వినతి పత్రం సమర్పించిన లబ్ధిదారులపై జిల్లా జాయింట్ కలెక్టర్ దాత్రి రెడ్డి అసహనం వ్యక్తం చేయడం కలకలం రేపింది. "ఇక్కడ పోలీస్ స్టేషన్ నిర్మించవద్దా అంటే బ్లాక్ మెయిలేనా?", "మీకు పట్టాలు ఉంటే చూపించండి" అంటూ ఆయన వ్యాఖ్యలు లబ్ధిదారులను ఆందోళనకు గురిచేశాయి. "మీరు అర్హులు అయితే వేరే చోట స్థలాలు ఇస్తాం" అనే జేసీ వ్యాఖ్యలతో ఆశలు వేసుకున్న పేద కుటుంబాలు తీవ్రంగా నిరాశకు లోనయ్యాయి. పెట్టుబడులు లేక, ప్రభుత్వాన్ని నమ్ముకుని ఉన్న లబ్ధిదారులు "మా స్థలాల్లో పోలీస్ స్టేషన్ ఎందుకు? ప్రభుత్వమే ఇళ్లు నిర్మించాలి" అంటూ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కోట జయ, ముక్కు అలివేలు మంగమ్మ, చిగురుపాటి చింతామణి, అవనిగడ్డ వెంకటేశ్వరమ్మ, మాణిక్యం, పద్మ, మరీదు కనకదుర్గ, ఎన్. బుజ్జమ్మ, కసిరెడ్డి ప్రసన్న, జి. సుజాత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సుమంత్‌కు ప్రశంసలు



**దెందులూరు, జూన్ 16 (జనస్వరం) :** ప్రతిభకు అంగవైకల్యం అడ్డు కాదని వినికిడి లోపం ఉన్నప్పటికీ కూడా స్థానిక జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థికి దివ్యాంగుల కోటాలో జాతీయ స్థాయి దివ్యాంగుల స్కాలర్‌షిప్ 2024 – 25 గాను సీహెచ్ సుమంత్ ఎంపిక అయ్యాడని, ఆ విద్యార్థి వ్యక్తి గత ఖాతాకు రూ.9000 జమ అయ్యాయని, ఆ పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు డి, సుధీర్ కుమార్ తెలియజేశారు. సుమంత్ ఇటీవల నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో తృతీయ స్థానంలో ఉత్తీర్ణుతుడై జాతీయస్థాయి దివ్యాంగుల కోటాలో స్కాలర్‌షిప్ పొందాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్లపట్ల విజయకుమార్, జి వెంకటేశ్వరరావు (లైబ్రరీ), వెంకటేష్, ప్రభుపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు సుమంత్‌ను అభినందించారు.

## కేంద్ర మంత్రికి తిరుచానూరులో బీజేపీ స్వాగతం



**తిరుపతి, జూన్ 16 (జనస్వరం) :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు బీజేపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడసాని పురుషోత్తం నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి అండ్ టీటీడీ బోర్డు సభ్యుడు గుడిపల్లి భానుప్రకాష్ రెడ్డిలు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రికి అమ్మవారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## శ్రీశైలంలో మద్యం పట్టివేత



**శ్రీశైలం, జూన్ 16 (జనస్వరం) :** శ్రీశైలమహాక్షేత్రంలో ఆర్టీసీ బస్ స్టాండ్ పార్కింగ్ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు మోటిరాం, బుజ్జి మద్యం విక్రయిస్తుండగా సీఐ జి. ప్రసాదరావు తమ సిబ్బందితో పట్టుకుని వారి వద్ద నుండి 98 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో సీఐ జి.ప్రసాదరావు, సిబ్బంది రఘునాథుడు, బాలకృష్ణ, బాలోజీ నాయక్, నారాయణ, నాగవేణి, అమర్నాథ్ రెడ్డి, లాల్స పాల్గొన్నారు. ముద్దాయిలు ఇద్దరిపై కేసు నమోదూ చేసుకుని ఆత్మకూరు కోర్టుకు రిమాండ్ నిమిత్తం తరలించారు.

## ఆర్థిక వ్యవస్థను జగన్ చిన్నాభిన్నం చేశాడు..

- కూటమి ప్రభుత్వంలో వైద్య సహాయానికి ప్రాముఖ్యత
- 92 మందికి రూ.68 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేత
- మంత్రి రామానాయుడు వెల్లడి



**పాలకొల్లు, జూన్ 16 (జనస్వరం) :** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పేద మధ్యతరగతి వర్గాల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పెద్ద ఎత్తున సహాయం అందిస్తుందని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు తెలిపారు. సోమవారం పాలకొల్లులో ఆయన కార్యాలయంలో నియోజకవర్గంలోని పేద వర్గాలకు వైద్య సహాయం అందించే నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధిగా 92 మందికి రూ.68 లక్షల చెక్కులను కూటమి నాయకులతో కలిసి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి సహాయ నిధులను సైతం పక్కదోవ పట్టించి పేదలకు వైద్యాన్ని పూర్తిగా దూరం చేశారని విమర్శించారు. పేదలకు వైద్య సాయం అందించలేక మానవత్వాన్ని మరిచిన వ్యక్తి జగన్ అని పేర్కొన్నారు. నేడు చంద్రబాబు అధికారంలోకి రాగానే మానవత్వంతో ముఖ్యమంత్రి సహాయ నిధిని పునరుద్ధరించారన్నారు. కూటమి ప్రభుత్వ 11 నెలల పాలనలో 50,235 మందికి, సుమారుగా రూ.349 కోట్లు వైద్య సహాయం అందించడం చిన్న విషయం కాదన్నారు. కేవలం ఒక్క పాలకొల్లు నియోజకవర్గంలోనే నాలుగు కోట్లకు పైగా వైద్య సహాయం అందించినట్లు మంత్రి రామానాయుడు తెలిపారు. జగన్ ప్రభుత్వంలో ఆసుపత్రుల యాజమాన్యాలకు వైద్య సేవలు కింద చెల్లించాల్సిన నిధు లను సైతం ఎగ్గొట్టగా.. ప్రభుత్వమే చెల్లించిందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర విధ్వంసమే కాకుండా ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి, చిల్లు కుండ ఇచ్చి వెళ్ళిపోయాడన్నారు. లిక్కర్, ఇసుక, గనులు, విలువైన భూముల ద్వారా లక్షల కోట్లను సొంత జేబులోకి వేసుకున్నాడన్నారు. గత పాలన లో మిగిలిన వనరులను దోచుకోవడానికి మళ్లీ అధికారంలోకి రావాలనే కోరిక తప్ప చేసిన తప్పు లకు పశ్చాత్తాపం లేని జగన్‌ను ప్రజలు ఎప్పటికీ క్షమించరని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షులు జీవీ, టీడీపీ జిల్లా నాయకులు కర్నేన గౌరునాయుడు, తమ్మినేని సత్యనారా యణ, గాదె చిన వెంకన్న, వల్లభ శ్రీనివాస్, అల్లం తాతాజీ, జగురోతు రాంబాబు, మల్లంపల్లి పకీర్ బాబు, బిరుదుకోట సోమశేఖర్, కూటమి నాయకులు బోనం నరసయ్య తులా రామలింగేశ్వర రావు, జనసేన పట్టణ అధ్యక్షులు సిడగం సురేంద్ర, కొమ్ముల దినేష్, బిట్టా లక్ష్మీనారాయణ, పినిశెట్టి శ్రీని వాస్, బీజేపీ నాయకులు ఉన్నమట్ల కపర్ది, జక్కంపూడి కుమార్, కొల్లికొండ కుమార్, తదితరులు పాల్గొన్నారు


## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



**చింతపల్లి, జూన్ 16 (జనస్వరం) :** మండల కేంద్రంలోని ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్థానికులు, పరిసర గ్రామాల ప్రజల నుంచి విపరీతమైన స్పందన లభించింది. కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ అనూష ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో లోతుగడ్డ, లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వచ్చిన 26 మంది రోగులకు కంటి పరీక్షలు చేపట్టారు. కంటి పరీక్షల అనంతరం వారిలో 26 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించడంతో, వారికి విశాఖపట్నంలోని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. శిబిరానికి విశేష స్పందన లభించడంతో భవిష్యత్‌లో మరిన్ని శిబిరాలను నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి రమణబాబు పాల్గొని శిబిర నిర్వహణను పర్యవేక్షించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న పలువురు రోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారు.

## మనోవేదనతో ప్రాణత్యాగానికి యత్నించిన యువతి

### కాపాడిన యడ్లపాడు పోలీసులు



**చిలకలూరిపేట, జూన్ 16 (జనస్వరం) :** తన జీవితంపై విరక్తి చెంది ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించిన ఓ యువతిని యడ్లపాడు పోలీసులు అప్రమత్తంగా స్పందించి సురక్షితంగా కాపాడారు. ఈ ఉదంతం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీయగా, పోలీసుల చొరవను అభినందిస్తున్నారు. యడ్లపాడు గ్రామానికి చెందిన గాడిపర్తి సురేష్ అనే వ్యక్తి డయల్ 100కు కాల్ చేసి, తన చెల్లెలు భర్తతో విభేదాల నేపథ్యంలో ప్రాణాలు తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారని అధికారులను హెచ్చరించాడు. సమాచారాన్ని అత్యవసరంగా స్వీకరించిన యడ్లపాడు ఎస్సై శివరామకృష్ణ వెంటనే స్పందించి, ఆ మహిళకు ఫోన్ చేసి మాట్లాడే ప్రయత్నం చేశారు. ఆమె "జీవితం పై విరక్తి కలిగింది" అంటూ చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో పరిస్థితి గంభీరంగా మారింది. ఈ క్రమంలో ఎస్సై బృందం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సెల్ టవర్ సిగ్నల్ ఆధారంగా ఆమె చివరిసారి ఉన్న లొకేషన్‌ను గుర్తించారు. ఆచూకీ ప్రకారం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం తక్కెళ్లపాడు గ్రామ శివారులో సాయంత్రం 5 గంటల సమయంలో ఆమెను పోలీసులు గుర్తించి సురక్షితంగా యడ్లపాడుకు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఉదంతంలో ప్రాణాన్ని కాపాడిన యడ్లపాడు పోలీసుల తక్షణ స్పందన, బాధ్యతాయుత వైఖరిపై స్థానికులు, సీనియర్ సిటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై శివరామకృష్ణ మాట్లాడుతూ, "అత్యవసర సందర్భాల్లో డయల్ 100 లేదా శక్తి యాప్‌లను సమర్థవంతంగా వినియోగించుకోవాలి. ఇవి ప్రజల ప్రాణ రక్షణకు ఎంతో కీలకం" అని సూచించారు.

## 31వ తేదీ వరకు అతిసార వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

### స్టాప్ డయేరియా కాంపెయిన్ పోస్టర్‌ను విడుదల జేసిన జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి



**ఏలూరు, జూన్ 16 (జనస్వరం) :** అతిసార వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఈనెల 16 నుండి 31 వరకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం 'స్టాప్ డయేరియా కాంపెయిన్'పై ముద్రించిన గోడపత్రికను జేసీ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో కలుషిత నీటి కారణంగా అతిసార వ్యాధి ప్రబలే అవకాశం ఉందని, దీని కారణంగా జిల్లాలో ఎటువంటి మరణాలు ముఖ్యంగా 5 సంవత్సరంలోపు వయస్సు కల పిల్లలు మరణాలు సంబంవించకుండా నివారించాలనేది జిల్లా యంత్రాంగం లక్ష్యమన్నారు. ఈ లక్ష్యసాధన దిశగా అధికారులందరూ పనిచేయాలన్నారు. జిల్లాలోని గ్రామ, పట్టణ ప్రాంతాలలోని 1822 మంది ఆశా కార్యకర్తలు, 605 మంది ఏఎన్ఎంలు, 463 మంది ఎంఎల్‌హెచ్‌పిలు ఇంటింటికి సర్వే నిర్వహించి 5 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన 1,44,422 మంది పిల్లలకు రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. అతిసార వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సురక్షితమైన తాగునీరు తీసుకోవడంతోపాటు, అతిసార వ్యాధి సోకితే తీసుకోవలసిన జాగ్రత్తలపై తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. అతిసార వ్యాధి నివారణపై ప్రచురించిన పోస్టర్ ను అన్ని ప్రధాన కూడళ్లలో ప్రదర్శించాలన్నారు. అంగన్వాడీ సిబ్బంది వారి పరిధిలో పోషకాహార లోపం, డయేరియాతో బాధపడుతున్నవారి వివరాలను దగ్గరలోని ఆరోగ్య సిబ్బందికి తెలియజేసి, వారికి చికిత్స అందించేలా చూడాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేలా పట్టణ, గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, డయేరియా కేసులు, అంటువ్యాధులు ప్రబలినవారు తీసుకోవలసిన చర్యలను గురించి 9912341488 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.మాలిని, జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి డా.పాల్ సతీష్, జిల్లా ఇమ్మునైజేషన్ ఇంచార్జ్ అధికారి డా.రాజీవ్, ప్రభృతులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ ముందుకెళ్తుంది

### ఎమ్మెల్యే బడేటి చంటి



**ఏలూరు, జూన్ 16 (జనస్వరం) :** కార్యదక్షతతో పనిచేసేందుకు అవసరమైన శక్తిసామర్థ్యాలు, నిబద్ధత కలిగిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ ముందుకెళ్తోందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి వెల్లడించారు. అలాగే తల్లికి వందన పథకంలో అర్హత ఉండీ ఇంకా లబ్దిపొందని తల్లలకు కూడా నగదు జమ అయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఏలూరు 48, 49 డివిజన్ పరిధిలోని 3, 4 సచివాలయాలను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబులు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడిన ఎమ్మెల్యే బడేటి చంటి, కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించీ, అమలు చేసిన తల్లికి వందనం పథకంలోని అర్హుల జాబితాలో ఉండీ నగదు జమకాని వారికి ఎదురైన సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. అలాగే పలువురు లబ్దిదారులతో మాట్లాడి, వారిలో భరోసా నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ తల్లికి వందనం పథకంలో అర్హుల జాబితాలో పేర్లు నమోదైనా నగదు జమకాని తల్లులు కొందరు ఉన్నారని, వారికి ఎదురైన సాంకేతిక సమస్యలను, ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సచివాలయాల సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీచేశామన్నారు. త్వరలోనే అర్హులైన మిగిలిన తల్లుల ఖాతాల్లో కూడా నగదు జమ అవుతుందని భరోసా ఇచ్చారు. అలాగే 1వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు సంబంధించిన లబ్ది ఈ నెల 30న వారి తల్లుల ఖాతాల్లో జమ అవుతుందని వెల్లడించారు. ఈ విషయంలో ఎవ్వరూ అధైర్యపడొద్దని, అర్హులందరికీ న్యాయం చేసేందుకు తాను కృషిచేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, కో – ఆప్షన్ సభ్యులు ఎస్మెమ్మార్ పెదబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శంఖవరం నూతన ఎంపీడీఓగా లక్ష్మీరెడ్డి



**శంఖవరం, జూన్ 16 (జనస్వరం) :** స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎఫ్ఏసి)గా ఎ లక్ష్మీరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. లక్ష్మీరెడ్డి ఇప్పటి వరకు ఐ పోలవరం మండలం ఎంపీడీఓగా పనిచేసారు. ఇప్పటి వరకు ఎంపీడీఓగా పనిచేసిన ఎన్ఎమ్ కెజి ప్రసాద్ రెండు నెలలకే సాధారణ బదిలీల్లో భాగంగా కిర్లంపూడికి బదిలీపై వెళ్ళారు. ఎంపీడీఓ లక్ష్మీరెడ్డిని మండల పరిషత్ సిబ్బంది, ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో మురుగు నీరు లేకుండా, పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపడతానన్నారు. ప్రస్తుతం నడుస్తున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటానన్నారు.